ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 38.0

కనిష్ఠం : 22.0



బీసీలకు పూర్వ వైభవం

» వైసీపీలో బీసీలకు ప్రాధాన్యం సున్నా

ఆదరణ లేదు.. రాయితీలు లేవు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం-జనసేన బీసీ డిక్లరేషన్ ప్రజల్లో సానుకూల చర్చ జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు మొండి చేయి చూపారంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్థికంగా, రాజకీయంగా దెబ్బతిన్నామంటూ బీసీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇటువంటి తరుణంలో టీడీపీ-జనసేన కూటమి బీసీ డిక్లరేషన్ ప్రకటించింది. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ మంజూరు చేస్తామని స్పష్టం చేసింది. స్థానిక సంస్థల్లో గతంలో మాదిరిగానే 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని తేల్చి చెప్పింది. బీసీల హక్కులను కాపాడేందుకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామంటూ భరోసా ఇచ్చారు. బీసీ సబ్‌ప్లాన్‌కు ఐదేళ్లలో రూ.1.50 లక్షల కోట్లు వ్యయం, స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు కేటాయింపు వంటి పథకాలు అమలు చేస్తామని తెలుగుదేశం కూటమి ప్రకటించడంతో బీసీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. వైసీపీ హయాంలో బీసీలకు రద్దు చేసిన 30 పథకాలను తిరిగి పునరుద్ధరిస్తామన్న ప్రకటన ఊరట నిస్తోంది.

వైసీపీలో మొండిచేయి

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు మొండి చేయి చూపారు. రాయితీ రుణాలు రద్దు చేశారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు బీసీలకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి కొంతమందికి నామినేటెడ్ పదవులు కల్పించారు. కానీ కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించలేదు. మరోవైపు వృద్ధాప్య పెన్షన్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను అన్ని ప్రభుత్వాలు అమలు చేశాయి. అందులో కేటాయించిన నిధులను బీసీ సంక్షేమ జాబితాలో కలిపేసుకుని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెపుతోంది. తెలుగుదేశం హయాంలో ఆదరణ పథకాన్ని అమలు చేశారు. చేతివృత్తిదారులకు పరికరాలు అందించారు. రాయితీతో బీసీ రుణాలు కల్పించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవన్నీ అటకెక్కిపోయాయి.

తెలుగుదేశం-జనసేన డిక్లరేషన్‌పై సర్వత్రా హర్షం

స్థానిక సంస్థల్లో పట్టుకోల్పోయిన బీసీలు

స్థానిక సంస్థల్లో వైసీపీ బీసీలకు ప్రాధాన్యం తగ్గించింది. రిజర్వేషన్‌లు కుదిం చింది. తెలుగుదేశం హయాంలో స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ అమలు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 889 పంచాయతీలు ఉంటే అందులో 34 శాతం బీసీలకు దక్కేవి. అంటే 302 పంచాయతీల్లో బీసీ వర్గాలే సర్పంచ్‌లుగా ఎన్నికయ్యేవారు. వార్డు సభ్యులగానూ సముచిత ప్రాధాన్యం లభించేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రిజర్వేషన్‌లను 27 శాతం కుదించింది. దాంతో సుమారు 63 పంచాయతీల్లో బీసీలు ప్రాతినిధ్యం కోల్పోవలసి వచ్చింది. ఇదికూడా బీసీ వర్గాలను ఆగ్రహానికి గురిచేసింది. వైసీపీ ప్రభుత్వం బీసీలను అణచివేసే ప్రయత్నం చేస్తోందంటూ ఆ వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ సమయంలో బీసీల కోసం తెలుగుదేశం-జనసేన ప్రకటించిన డిక్లరేషన్‌పై సానుకూల చర్చ సాగుతోంది.

ప్రత్యేక రక్షణ చట్టంతో భరోసా



వెనుబడిన కులాల అభివృద్ధే లక్ష్యంగా టీడీపీ జనసేన పార్టీలు పనిచేసేందుకు సాక్ష్యమే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ప్రకటించిన బీసీ డిక్లరేషన్. జగన్ పాలనలో 26 వేల మంది బీసీలపై అక్రమ కేసులు బనాయించారు. 300 మంది బీసీ వర్గాల వారిని హత్య చేశారు. అందుకే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తున్నాం. బీసీ సబ్ ప్లాన్ నిధులను బీసీలకే ఉపయోగిస్తాం.

-తోట సీతారామలక్ష్మి, టీడీపీ 'పశ్చిమ' జిల్లా అధ్యక్షురాలు

శెట్టిబలిజలను దగా చేసిన జగన్



బీసీ డిక్లరేషన్ ఎంతో ఆనందాన్ని కల్గించింది. ప్రత్యేక రక్షణ చట్టం ద్వారా మంచి గౌరవం దక్కుతుంది. 50 ఏళ్లకే పెన్షన్, బీసీల సబ్‌ప్లాన్ నిధులు బీసీలకే, స్థానిక సంస్థలలో రిజర్వేషన్ వంటి పథకాలను ప్రకటించండం ద్వారా బీసీలకు మంచి భరోసాను కల్పించారు. జగన్ ప్రభుత్వం 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసింది. అందులో అత్యధిక జనాభా ఉన్న శెట్టిబలిజ కార్పొరేషన్‌కు ఈ నాలుగు సంవత్సరాల్లో ఒక్క రూపాయి ఇవ్వలేదు. శెట్టిబలిజలు జగన్‌కు బుద్ధి చెప్పబోతున్నారు.

-బొక్కా సూరిబాబు, రాష్ట్ర శెట్టి బలిజ సాధికార సమితి డైరెక్టర్, భీమవరం



11 నుంచి పెద్దింటి అమ్మవారి జాతర

» 15 రోజుల పాటు ఉత్సవాలు.. భారీ ఏర్పాట్లు

కైకలూరు, మార్చి 6: కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి జాతరకు భారీ ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. ఈనెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు 15 రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు భక్తుల దర్శనార్థమై పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పాలపొంగళ్లను పొంగించుకునేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు ఆలయం చుట్టూ చలువ పందిళ్లను ఏర్పాటు చేసి పలు తోరణాలతో డెకరేషన్ చేస్తున్నారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల సౌకర్యార్థమై ఉచిత, అంతరాలయ దర్శనాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ ఈవో కేవీ గోపాలరావు తలిపారు. ఈ మేరకు ఏర్పాట్లను ఆలయ అధికారులు బుధవారం పరిశీలించారు.

ఇంటర్ పరీక్షలకు 925 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 6 :ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలో భాగంగా బుధవారం జరిగిన గణితం/వృక్షశాస్త్రం/పౌరశాస్త్రం పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయని డీవీఈవో, పరీక్షల కన్వీనర్ ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో 14,192 మంది, ఒకేషనల్ విభాగంలో 1985మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదన్నారు.

ముగిసిన 'టెట్'

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 6 :టెట్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజున ఈ పరీక్షల కు ఉదయం 333మంది, మధ్యాహ్నం 322 మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలి పారు. మొత్తం 75మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదుకాలేదన్నారు.

భైరవపట్నంలో ఫ్లెక్సీల వివాదం



ఫ్లెక్సీల వివాదంతో భారీగా చేరుకున్న వైసీపీ, టీడీపీ నాయకులు

» అసభ్య పదాలతో వైసీపీ సిద్ధం ఫ్లెక్సీలు » తొలగించాలని టీడీపీ నాయకుల డిమాండ్

» భారీగా చేరుకున్న వైసీపీ, టీడీపీ శ్రేణులు » సర్దిచెప్పి ఇరువర్గాలను పంపించిన పోలీసులు

మండవల్లి, మార్చి 6: భైరవపట్నంలో వైసీపీ, టీడీపీ ఫ్లెక్సీల వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవన ప్రారంభోత్సవం గురువారం పురస్కరించుకుని బుధవారం రాత్రి వైసీపీ నాయకులు పలు సిద్ధం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వాటిలో ఒక ఫ్లెక్సీపై అభ్యంతరకర పదాలు ఉండడంతో తక్షణమే తొలగించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ ఫ్లెక్సీలో అసభ్యపదం ఎవరిని ఉద్దేశించి పెట్టారో చెప్పాలని టీడీపీ నేతలు ప్రశ్నించారు. దీనికి ఎవరూ సమాధానం చెప్పకపోవడంతో నిరసనగా టీడీపీ నేతలు మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన తెలుసుకున్న మండవల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని టీడీపీ నేతలు కట్టే ఫ్లెక్సీని ఏర్పాటు చేయనివ్వకుండా అడ్డుకున్నారు. టీడీపీ నేతలు ఎట్టిపరిస్థితుల్లో కట్టితీరుతామని పట్టుబట్టారు. అసభ్యకరమైన పదజాలంతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని తొలగిస్తే చాలు అని తాము ఎలాంటి ఫ్లెక్సీ కట్టమని అనంతరం చెప్పినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఇరువర్గాలు భారీగా చేరుకోవడంతో కైకలూరు రూరల్ పోలీసులు సైతం ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎంతసేపటికి ఫ్లెక్సీ తొలగించేందుకు గానీ, టీడీపీ ఫ్లెక్సీ కట్టేందుకు గానీ అనుమతించలేదు. ఇరువర్గాలకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించివేశారు.

ఆరుగురు వైసీపీ కార్యకర్తలపై కేసు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముసునూరు, మార్చి 6: రమణక్కపేటలో పంచాయతీ స్థల ఆక్రమణను అడ్డుకున్న టీడీపీ కార్యకర్త ఉప్పే శివ నాగాంజనేయులుపై దాడిచేసిన ఆరుగురు వైసీపీ కార్యకర్తలపై ముసునూరు ఎస్‌ఐ పి.వాసు బుధవారం కేసు నమోదు చేశారు. స్థల ఆక్రమణ అడ్డుకున్నాడని 'టీడీపీ కార్యకర్తపై దాడి' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి పోలీసు అధికారాలు స్పందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శివ నాగాంజనేయులు ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం వైసీపీ కార్యకర్తలైన ఉప్పే సుబ్బారావుతోపాటు శ్రీనివాసరావు, పెదకాపు, మారేశ్వరరావు, పిచ్చేశ్వరరావు, శివరామకృష్ణలపై పోలీసులు కేసు నమోదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో సీహెచ్. పద్మావతిదేవి ఆధ్వర్యంలో ఆక్రమణదారుడు ఉప్పే సుబ్బారావుకు పంచాయతీ కార్యాదర్శి ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ స్థలంలోని ఆక్రమణను తొలగించక పోతే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

» సంఖ్యా బలంతో నెగ్గించుకున్న తీర్మానాలు

» ప్రతిపక్ష సభ్యుల అభ్యంతరాలను పట్టించుకోని వైనం

» ఈ ఏడాది బడ్జెట్ ఆమోదం

» నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం



డిప్యూటీ మేయర్‌ను నిలదీస్తున్న కార్పొరేటర్లు (ఇన్‌సెట్‌లో) మేయర్ నూర్జహాన్

ఏలూరుటూటౌన్, మార్చి 6: నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం రసాభాసగా మారింది. అధికార పార్టీ సభ్యులు సంఖ్యా బలంతో బడ్జెట్‌ను ఆమోదించుకున్నారు. ప్రతిపక్ష పార్టీ సభ్యుల అభ్యంతరాలు పట్టించుకోలేదు. మీ అభ్యంతరాలతో మాకు పనిలేదు. సంఖ్యాబలంతో మా తీర్మానాలన్ని ఆమోదించుకుంటామని అధికార పార్టీ సభ్యులు అహంకారపూరిత ధోరణితో వ్యవహరించారు.

ప్రతిపక్ష, అధికార పక్షనగర పాలక సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరానికి 243 కోట్ల 84లక్షల 12వేల రూపాయలతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. దీనిలో ప్రారంభ నిల్వ 46కోట్ల 39లక్షల 92వేలు, ఆదాయం కింద జమలు 197 కోట్ల 44లక్షల 20వేల రూపాయలు వస్తాయని అంచనావేశారు. ముగింపు నిల్వ 10కోట్ల 31లక్ష 67వేల రూపాయలుగా చూపించారు. ఈబడ్జెట్ ప్రతిపాదనలో ప్రతిపక్షాల అభ్యంతరాల నడుమ కౌన్సిల్ ఆమోదం పొందింది. బడ్జెట్‌లో రూ.50లక్షలు శ్మశాన వాటికల అభివృద్ధికి చాలవని ఇంకా పెంచాలని వైసీపీ నుంచి ఇటీవల టీడీపీ తీర్థం పుచ్చుకున్న కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఒక వెంకన్న చెరువు శ్మశాన వాటిక అభివృద్ధికే రూ.కోటి అవసరమవుతుందన్నారు. అశోక్ నగర్ శ్మశాన వాటికను వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని దానిని అభివృద్ధి చేసేందుకు బడ్జెట్ కేటాయింపులు ఏమని ప్రశ్నించారు. రెచ్చిపోయిన 45మంది వైసీపీ కార్పొరేటర్లు మూకుమ్మడిగా దాడి చేశారు. శ్మశానవాటికల అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం ఎన్నో కోట్లు ఖర్చుపెట్టిందని అవసరమైతే ఇంకా ఖర్చుపెడతామని డిప్యూటీ మేయర్లు గుడిదే శ్రీనివాసరావు, నూకపేయి సుధీర్‌బాబు వాదించారు. అనంతరం మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ గత బడ్జెట్‌లో రూ.231కోట్లు 70లక్షల 24వేలతో నగరాన్ని ఎంతో అభివృద్ధిచేశామన్నారు. ఈ ఏడాది ఆమోదం పొందిన బడ్జెట్‌తో నగరాన్ని మరింత అభివృద్ధి పదంలో నడిపిస్తామన్నారు. అనంతరం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా 17 అంశాలతో అజెండాను ప్రవేశపెట్టారు. టేబుల్ అంశాలుగా మూడు అంశాలను అజెండాలో చేర్చారు. మొత్తం 20 అంశాలను కార్యాలయ సూపరింటెండెంట్ శిరాజ్ చదడం పూర్తవ్వకముందే అధికార పార్టీ సభ్యులు ఆమోదం పొందినట్టుగా బల్లలు కొట్టడంతో ప్రతిపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చుతూ కౌన్సిల్ తీర్మానం జరిగినట్టు ప్రకటించుకున్నారు. టీడీపీ సభ్యులు తంగిరాల అరుణ, పృధ్వీశారద, వందనాల దుర్గాభవానీ పలు అంశాలపై అభ్యంతరాలు లేవనెత్తినప్పటికి అధికార పార్టీ సభ్యులు పట్టించుకోకుండా అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించుకున్నారు. కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని అవసరమైతే వారు లేవనెత్తిన అంశాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. నగరాభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, బడ్జెట్ ఆమోదించినందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొల్లేరులో ఉద్రిక్తత

» పైడిచింతపాడు చెరువులకు నీరు నిలిపివేసిన అటవీ సిబ్బంది

» గ్రామస్థుల అభ్యంతరం.. వాగ్వాదం

ఏలూరు రూరల్, మార్చి 6: కొల్లేరు ఆపరేషన్ తరువాత మళ్లీ నెమ్మదిగా మొదలైన చెరువుల ఆక్రమణలు ఇటీవల కొన్నేళ్లుగా విశ్వరూపం దాల్చుతున్నాయి. అభయారణ్యం ఇప్పుడు ఆక్రమణకు నెలవుగా మారుతోంది. కొంతమంది స్వార్థపూరిత వ్యక్తులు కొల్లేరులో అక్రమచెరువులు తవ్వకానికి ఒడిగడుతున్నారు. ప్రతి ఏటా కొల్లేరులో ఈతంతు జరగడం పరిపాటే. ప్రస్తుతం కొల్లేరు అభయారణ్యంలో తవ్వకాలు మళ్లీ ప్రారంభం అయ్యాయి. అటవీశాఖ, వన్యప్రాణి విభాగం అధికారులు ఏలూరు రూరల్ మండలంలోని పైడిచింతపాడు గ్రామంలో కొల్లేరు అభయారణ్య పరిధిలోని సుమారు 102 ఎకరాల అటవీ భూమిని చేపలచెరువుగా మారుస్తున్నారన్న ఫిర్యాదు మేరకు 30మంది అటవీశాఖ సిబ్బంది బుధవారం పైడిచింతపాడు గ్రామం చేరుకున్నారు. చెరువులకు నీరు నింపే పనిని నిలుపుదల చేస్తుండగా కొల్లేరు నాయకులు, పలువురు గ్రామస్థులు అటవీశాఖ సిబ్బందిని అడ్డుకున్నారు. వారి విధులు నిర్వర్తించకుండా వాగ్వివాదానికి దిగారు. తమ విధులకు ఆటంకం పరిచారని వన్యప్రాణ విభాగం వీఎఫ్‌వో హిమశైలజ తెలిపారు. ఇటీవల పైడిచింతపాడులో అక్రమంగా చేపల చెరువుతవ్వుతున్నారనే సమాచారం కలెక్టర్ దృష్టికి వెళ్ళడంతో ఆయన జాతీయ హరిత న్యాయస్థానం ఆదేశాల మేరకు అక్రమ చేపలచెరువుల కార్యకలాపాలను ఆపివేయాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఉదయం అటవీ, పోలీస్‌సిబ్బంది ఆ చెరువువద్దకు వెళ్లి తక్షణం ఆ ప్రాంతం ఖాళీ చేయాలని తెలపడంతో అక్కడే ఉన్న కొల్లేరు నాయకులు, గ్రామస్థులు అటవీశాఖ సిబ్బందిని అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. ఈ సందర్భంగా డివిజనల్ అటవీశాఖ, వన్యప్రాణి యాజమాన్య విభాగం ఉత్తర్వుల మేరకు 120 జీవోను అనుసరించి చేపలవేట చేసుకునే హక్కు ఉందని, అలా చేసుకుంటూ కొల్లేరుకు పూర్వ వైభవం తీసుకురావడానికి సహకరించాలని వారికి విజ్ఞప్తి చేశారు. అనంతరం కొల్లేరు గ్రామాల్లో పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌లలో సంప్రదాయ వేటను ప్రోత్సహించేలా పోస్టర్లను అంటించి అవగాహన కల్పించారు.



అటవీశాఖ అధికారులతో కొల్లేరు నాయకుల వాగ్వాదం

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

» ఐజీ అశోక్‌కుమార్

7

కేజీ పొగాకు ధర రూ.240

» ఆశాజనకంగా ఉందంటూ రైతుల ఆనందం

ఒక్కో ఆలయం.. ఒక్కో చరిత్ర

శివరాత్రికి ముస్తాబు.. ఓసారి వెళ్లొద్దాం


కోనేరులో పరుశురాముడు ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామి

త్రిలింగ క్షేత్రం.. నత్తా రామేశ్వరం

పెనుమంట్ర, మార్చి 6: నత్తా రామేశ్వరం త్రిలింగ క్షేత్రంగా ప్రాచుర్యం పొందింది. సీతారామచంద్రులు అయోధ్యకు వెళుతూ మార్గమధ్యలో గోస్తనీ నదిలో పరశురాముడు ప్రతిష్ఠించిన సప్త కోటి లింగం శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. గట్టుపైన శివలింగాన్ని ప్రతిష్ఠించేందుకు హనుమంతుని శివలింగం తీసుకురావాలని ఆజ్ఞాపించారు. ముహూర్త సమయం దగ్గర పడటంతో గోస్తనీ నదిలో ఇసుక, నత్తగుల్లలు. వంద్రు మట్టి మిశ్రమాన్ని శివలింగంగా చేసి ప్రతిష్ఠించడంతో గ్రామానికి నత్త రామేశ్వరం అని పేరు వచ్చింది. రామేశ్వరస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి, గోస్తనీ నది అవతలి వైపున లక్ష్మణేశ్వరస్వామి అనే మూడు శివ లింగాలు ఒకేచోట ఉండుటచే త్రిలింగ క్షేత్రంగా పిలవబడుతుంది. ఎనిమిదో తేదీ శివరాత్రి పురస్కరించుకుని రథోత్సవంపై పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఊరేగింపు నిర్వహిస్తారు.

శ్రీఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి



జుత్తిగలో శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి క్షేత్రం గురించి వాయు పురాణంలోని గోస్తాని నదీ మహత్యం పూర్వం ధూతి కాపురం నేడు జుత్తిగగా పిలవబడుతుంది. త్రేతాయుగంలోని దుష్టుడైన రావణాసురుడిని వాసుకి అనే రాజు రవి అనే సూర్యుడిని సోము అనే చంద్రుడిని పరాభవించి నాడు రావణుడు పరివారమైన భయంకర రాక్షసులను దేవతలను పీడింప సాగిరి. రవి, సోములు వాసుకి గోస్తానీ నది తీరంలో లింగాన్ని ప్రతిష్టించి పూజించారు ఈ లింగానికి వాసుకి రవి సోమేశ్వర స్వామిగా పేరు వచ్చింది.

ఇదీ ఆచంటేశ్వరుని చరిత్ర



ఆచంట, మార్చి 6 : ఏటా ఐదు రోజులు మహాశివరాత్రి మహోత్సవాలు ఆచంటేశ్వరుని ఆలయంలో జరుగుతాయి. భారతావనిలో ప్రసిద్ధ ఆలయాలలో ఆచంటేశ్వర క్షేత్రం ఒకటి. గోదావరి తీరానికి కొంత దూరంలో పూర్వపు మార్తాండ పురమే ఆచంటగా పేరుగాంచింది. పూర్వం తారకాసుర సంహారం తరువాత శివ పార్వతులు కేళీ విలాస సమయంలో ముని దంపతులు శివసాన్నిధ్యం కోరి కైలాసమేగగా పరీక్షముగా తిలకించుట శివుడు గమనించి ఆ దంపతులను బాల బాలికలను చేసి, బ్రహ్మచర్యము ఆచరించిన శివ సాన్నిధ్యం పొందుతారని ఆజ్ఞాపించెను. శివుని ఆజ్ఞ పాటించనందున శాపగ్రస్తులై తిరువల్లూరు లో బ్రాహ్మణుని పుష్పసుందరుడు ఒడయనంబిగా, మార్తాండపురలో కళావంతుల ఇంట పుష్ప సుందరి పరమనాచిగా జన్మించారు. మహా శివరాత్రి రోజున ఆ దంపతులు సుఖ నిద్రకు లోనై పూజలకు సమయం మించిపోయినందున భక్తుడైన ఒడయనంబి, పరమనాచి యొక్క స్థనాగ్రభాగమున ప్రత్యక్షముగా కనిపించగా శంకరుడు ఆ దంపతులకు శివ సాన్నిధ్యం చేకూర్చెను. స్వామి స్థనాగ్రభాగమున వెలసి నం దున మార్తాండపురము ఆచంటేశ్వరుడిగా విరాజిల్లుతున్నది.

దక్షిణ కాశి.. శ్రీ మేధా దక్షిణామూర్తి



దెందులూరు, మార్చి 6 : స్వయంభుగా వెలసినట్టు పేరు పొందిన శివాలయాల్లో అతిపురాతన మైనది దక్షిణ కాశీగా చల్ల చింతలపూడిలో శివాలయం. 800 సంవత్సరాల క్రితం వేంగీ రాజులు నిర్మించారని స్వయంభుగా శివుడు ఇక్కడ పాదం మోపాడని పురాణ కథనం. ఇక్కడ పంచాయతన క్షేత్రంగా శ్రీ మేధా దక్షిణామూర్తి ఉండేవాడని పెద్దలు చెబుతున్నారు. ఈ చల్లచింతలపూడిలో రైతులు, పశుపోషణతో జీవనం సాగించే వారని, దీంతో పెరుగు, పాలు పుష్కలంగా ఉండటంతో తెల్లవారుజాము నుంచి గ్రామంలో మజ్జిగ(చల్ల) చేయడం ప్రారంభించేవారని ఆ శబ్ధాన్ని భరించలేని శివుడు కృష్ణా, పశ్చి మ జిల్లాలోని విజయరాయి సరిహద్దులోని బలివేలో బలివే రామస్వామిగా వెళ్లారని చెబుతారు. శివుడు వెళ్లే సమ యంలో శివాలయ మండపం పడిపోతుండగా భక్తులు శివుడి ని వేడుకోగా పడిపోతున్న శివాలయ మండపాన్ని ఆగిపోమ ని ఆజ్ఞాపించడంతో సగం పడిన మండపం నిలిచిపోయిందని పెద్దలు చెబుతున్నారు.

ఆలయ స్థల పురాణం

త్రేతాయుగములో లింగ ప్రతిష్ఠ జరిగినట్లు చరిత్ర చెబుతోంది. శ్రీరాముడు రావణ సంహరణం అనంతరం బ్రహ్మహత్య దోష నివారణకు అనేకచోట్ల ఈశ్వర లింగ ప్రతిష్ఠ చేసుకుంటూ అయోధ్య చేరడానికి ముందు మహా అరణ్యమైన స్థలంలో ప్రతిష్ఠ చేసినట్లు ప్రసిద్ధి. బలిచక్రవర్తి పరిపాలించడంతో బలివే పేరుపై బలివే రామస్వామిగా పిలుస్తున్నారు.

శివదేవ స్వామికి ఉత్సవాలు



పాలకొల్లు రూరల్, మార్చి, 6: వాయు త్రిలింగ క్షేత్రాల్లో శివదేవుని చిక్కాలలో శివదేవ స్వామి క్షేత్రం ఒకటి. శ్రీఆంజనేయ స్వామి ప్రతిష్ఠించిన శివ దేవస్వామి ఆలయం ప్రసిద్ధి గాంచింది. శివరాత్రి రోజున సంతానం కోసం స్వామికి అభిషేకం చేసి, ఆలయ ప్రాంగణంలో కొబ్బరి సుధ మొక్కలు నాటితే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

రేపు మహా సుదర్శన నృశింహ యజ్ఞం


దేవతామూర్తుల విగ్రహాలు

ద్వారకా తిరుమల, మార్చి 6: సుందరగిరిపై స్వయంభుమూర్తిగా కొలువైన శ్రీలక్ష్మీనరసింహుని ఆలయంలో మహా శివరాత్రి పురస్కరించుకుని శ్రీమహా సుదర్శన నృశింహ యజ్ఞానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ వాసి కొచ్చర్లకోట నరసింహ గురూజీ ఆధ్వర్యంలో సీహెచ్ కుటుంబరావు యజ్ఞ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అభిషేకానికి 1008 కలశాలను సిద్ధం చేశారు.

నేత్రపర్వం...ధ్వజారోహణ.

శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్ల దివ్యకల్యాణ మహోత్సవాల్లు క్షేత్రపాలకుని ఆలయంలో జరుగుతున్నాయి. వేదపారాయణలు, శివదేవునికి అభిషేకాలు నిర్వహించారు.

ఆచంటేశ్వరుడి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం


వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

ఆచంట, మార్చి 6 : ఆచంటేశ్వరుని మహాశివ రాత్రి కల్యాణోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి, దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ విద్యాసాగర్, కమిటీ సభ్యులు ఆలయ అధికారి రాము, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఐదు రోజులు జరిగే మహా శివరాత్రి ఉత్సవాల ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ వేజెండ్ల అజిత అన్నారు. బుధవారం ఎస్పీ ఆచంట వచ్చి ఉత్సవ ఏర్పాట్లపై ఈవో రాముని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం డీఎస్పీ, ఎస్ఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కళ్యాణ మహోత్సవాలు ప్రారంభం

భీమవరం టౌన్, మార్చి 6: పంచారామ క్షేత్రంలో మహా శివరాత్రి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సోమేశ్వర జనార్దన స్వామివారి ఆలయంలో శివరాత్రి కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకారం చేశారు. ధ్వజారోహణ నిర్వహించారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబు



పాలకొల్లు టౌన్, మార్చి, 6: పంచారామ క్షేత్రాల్లో ఒకటైన పాలకొల్లు శ్రీ క్షీరారామలిం గేశ్వర స్వామి దేవస్థానం శివరాత్రి మహోత్సవాలకు ముస్తాబవుతోంది. రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలలో శిరోభాగం పూజలు క్షీరారామలింగేశ్వరస్వామి అందుకుంటున్నారు. పాలకొల్లు పట్టణంలో 13వ శతాబ్ధంలో చోళులు 9 అంతస్తులుగా 125 అడుగుల ప్రాకారంతో నిర్మించిన గోపురం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. శివలింగమును శ్రీరామచంద్ర మూర్తి ప్రాణ ప్రతిష్ఠ చేయగా విష్ణుమూర్తి క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతున్నారు.

18 జడ్పీ హైస్కూళ్లు.. జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 6 : హైస్కూల్, ఇంటర్ విద్యను(10+2) ఒకేచోట అందించాలనే లక్ష్యంతో ఉమ్మడి జిల్లాలో కొత్తగా 18 జడ్పీ జూనియర్ కళాశాలల (హైస్కూల్ ప్లస్)ను ప్రస్తుత హైస్కూళ్లనే అప్‌గ్రేడ్ చేయడంతో 2024-25 విద్యా సంవత్సరం జూన్ ఒకటి నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైస్కూల్ ప్లస్‌లకు ఇవి అదనం. జడ్పీ జూనియర్ కళాశాలలను కో-ఎడ్యుకేషన్ విధానంలో ఏర్పాటు చేస్తారు. కొత్త కళాశాలల ఏర్పాటుకు డీఈవో, ఆర్జేడీలు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రస్తుత కళాశాలలకే విద్యార్థుల కొరత

ప్రతీ మండలానికి ప్రభుత్వ యాజమాన్యంలో బాలికలకోసం ఒక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో రెండేళ్ల క్రితం జిల్లా మొత్తం 24 హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేశారు. బోధనా సిబ్బంది నియామకాలు, పాఠ్యపుస్తకాలు, ల్యాబ్‌లు వంటి మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం గత విద్యా సంవత్సరం పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ తక్కువగా ఉంది. ఈ లోపాలతో కొత్తగా ఏర్పాటైన 24 జడ్పీ జూనియర్ కళాశాలల్లో చింతలపూడి, చాట్రాయి, గుణ్ణంపల్లి, కానుకొలను, గురజ కళాశాలల్లో ఒక్కరూ లేకుండానే కేవలం రికార్డుల్లో కొనసాగుతున్నాయి. జడ్పీ జూనియర్ కళా శాలల్లో (హైస్కూల్ ప్లస్) ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కేవలం 302 మంది మాత్రమే. పూర్తి స్థాయిలో బోధనా సిబ్బందిని నియమించినా జడ్పీ జూనియర్ కళాశాలల ఏర్పాటు ప్రయోగం విఫలమైనట్టేనని విమర్శలు లేకపోలేదు.

ఉమ్మడి జిల్లాలో కొత్త కళాశాలలు

ఏలూరు జిల్లాలో పూళ్ళ, చిన్నంపేట, కొవ్వలి, పంగిడిగూడెం, రావికంపాడు, చెక్కపల్లి, పెదనింద్రకొలను, పెదవేగి, బొర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్లు, పశ్చిమ గోదావరిలో రేలంగి, కోపల్లి, ముత్యాలపల్లి, ఎల్.బి.చర్ల, శృంగవృక్షం, దేవ, మార్టేరు, పోడూరు, వీరవాసరం జడ్పీ హైస్కూళ్లు ఎంపికయ్యాయి.

కేజీ పొగాకు ధర రూ.240

» ఆశాజనకంగా ఉందంటూ రైతుల ఆనందం

» 5 వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభం


జంగారెడ్డిగూడెం వేలం కేంద్రంలో పొగాకు కొనుగోలు ప్రారంభిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం, మార్చి 6:ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో రెండు, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లిలో ఒక్కొక్క కేంద్రం చొప్పున మొత్తం ఐదు పొగాకు వేలం కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభమైంది. ప్రారంభ ధర కేజీకి గరిష్టంగా రూ. 240 పలకడంతో రైతాంగం ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభం లోనే మిచాంగ్ తుఫాన్ దెబ్బకు తోటలన్నీ సర్వనాశనం అయ్యాయి.

ఉమ్మడి పశ్చిమలో బుధవారం నుంచి ఎన్ఎల్ ఎస్ పరిధిలో గల ఐదు వర్జీనియా వేలం కేంద్రాల్లో వేలం ప్రక్రియలో భాగంగా ప్రారంభ ధర ఆశాజనకంగా ఉందని రైతులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రారంభంలో ధర సంతృప్తి కరంగా ఉండటంతో రానున్న రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. సరాసరి ధర అధికంగా ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. ఈ సీజన్‌లో తుఫాను తాకిడికి తీవ్రంగా వర్జీనియా రైతు నష్టపోయాడని, దానిని దృష్టిలో పెట్టుకుని సరాసరి ధర మంచి ధర ఇప్పించాలని కోరారు. ఇదిలా ఉంటే అధికంగా పండిన పంటకు అపరాధ రుసుము లేకుండా పొగాకును కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా ఉమ్మడి పశ్చిమలో ఐదు వేలం కేంద్రాల్లో ప్రారంభ ధర కేజీ ఒక్కింటికి రూ.240 లభించింది. జంగారెడ్డిగూడెం 1వ వేలం కేంద్రంలో 27బేళ్లు, 2వ వేలం కేంద్రంలో 99బేళ్లు, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం వేలం కేంద్రాలకు 27 బేళ్లు వంతున రైతులు వేలం కేంద్రానికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమ ంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య, వేలం కేంద్రం అధికారులు శ్రీహరి, సురేంద్ర, రైతు నాయకులు కరాటం రెడ్డిబాబు, ఘంటశాల గాంధీ, రాంబాబు, వామిశెట్టి హరిబాబు, గద్దే లక్ష్మణరావు, గడ్డమణుకు దత్తుడు, గద్దే ప్రసాద్, సత్రంవెంకట్రావు, వీవీఎస్ ప్రకాశరావు, పిన్నమనేని రాధాకృష్ణ, అట్లూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వేలం

ఈ ఏడాది వర్జీనియా వేలం ప్రక్రియ ఆశాజనకంగా ఉంటుందని పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ అన్నారు. జంగారెడ్డిగూడెంలోని వర్జీనియా వేలం కేంద్రం 1, 2లో వేలం ప్రక్రియ బుధవారం ప్రారంభంలో పాల్గొన్న ఈడీ అద్దంకి శ్రీధర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభమైందన్నారు. ఎన్ఎల్ఎస్ ఏరియా పరిధిలో గత ఏడాది వర్జీనియా రైతులకు ఎంతో ఆనందాన్ని మిగిల్చిందన్నారు. గరిష్ట ధరలు నమోదు చేస్తూ రైతులకు ఉత్సాహ పరిచిందన్నారు. గత ఏడాది గోదావరి జిల్లాల్లో ఎన్ఎల్ఎస్ పరిధిలో 57.90మిలియన్ కేజీల పొగాకు పంట పండగా, మంచి ధరలకు వేలం నిర్వహించారన్నారు. గరిష్ట ధర రూ.288 పలుకగా, సరాసరి ధర రూ.245.81 లభించిందన్నారు. ఇదే ఉత్సాహంతో రైతులు ఈ ఏడాది వర్జీనియాను సాగు చేశారన్నారు. ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో ప్రస్తుత సీజన్‌లో 66.65 మిలియన్ కేజీల పంట పండి ఉంటుందని శ్రీధర్ అంచనా వేశారు. ప్రస్తుతం మన పొగాకుకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. రైతులు సైతం నాణ్యమైన పొగాకు అందిస్తుండటంతో ఆశాజనకమైన మార్కెట్ లభిస్తోందన్నారు. గతంతో పోల్చితే విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుడటం శుభపరిణామం అన్నారు. మిచాంగ్ తుఫాను రైతులను ఇబ్బందులకు గురి చేసినప్పటికీ ఎంతో ఓర్పుతో రైతులు మంచి పంటను అందివ్వగలిగారన్నారు. ఈ సందర్భంగా రైతులు నిల్ సెస్ గురించి అడగగా స్పందించిన శ్రీదర్ బాబు సెస్ విధింపు లేదా రద్దు అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం అన్నారు. రైతులు తనకు తెలియజేసిన దానిని ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు.


కళాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామానాయుడు, బన్ని వాసు తదితరులు

ఉత్తమ ప్రదర్శనగా రాత నాటిక

పాలకొల్లు టౌన్, మార్చి 6 : పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో అద్దేపల్లి వారి సత్రంలో మూడు రోజులు పాటు నిర్వహించిన జాతీయస్థాయి నాటిక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా వెలగలేరు, థియేటర్ ఆర్ట్స్ వెలగలేరు వారి రాత నాటిక ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక ద్వితీయ బహుమతి పొందింది. కరీంనగర్‌కు చెందిన స్వప్నం రాల్చిన అమృతం నాటిక తృతీయ బహుమతి పొందింది. కళాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటిక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పాలకొల్లులో గత టీడీపీ హయాంలో 70 శాతం పనులు పూర్తిచేసిన బొండాడ వెంకటరాజు గుప్త, ఎన్టీఆర్ కళా క్షేత్రాన్ని అన్ని సౌకర్యాలతో అద్భుతంగా పూర్తిచేసి 2025లో రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాలను నిర్వహించేలా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. బన్ని వాసు, కేవీ కృష్ణవర్మ, మేడికొండ శ్రీనివాసరావు, డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, విశాకుల రమణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాపుల డిక్లరేషన్ ఎపుడు : జోగయ్య


పాలకొల్లు, మార్చి 6 : జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు జయహో బీసీ అంటూ పది హామీలతో కూడిన బీసీ డిక్లరేషన్స్ చంద్రబాబు, పవన్‌లు మంగళగిరిలో ప్రకటించారు. చాలా సంతోషం. 52 శాతం ఉన్న వెనుకబడిన జాతులకు డిక్లరేషన్ ప్రకటించడం ఆహ్వానించదగ్గదే. మరి కాపులకు డిక్ల రేషన్ ఎపుడు ప్రకటిస్తారని కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు, మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామ జోగయ్య ప్రశ్నించారు. పవన్ బీసీలకు పెద్ద పీట వేస్తూ డిక్లరేషన్ ద్వారా 10 ఎన్నికల హామీలు ఇస్తూ ప్రకటన చేశా రని, కాపులకు డిక్లరేషన్ ప్రకటించాలని జోగయ్య సూచించారు. 25 శాతం ఉన్న కాపు కులస్థులకు టీడీపీ, జనేన తన ఎన్నికల మ్యానిఫెస్టోలో బీసీలకు సమానంగా సౌకర్యాలు కలగజేస్తూ హామీలు ఇవ్వాల్సి ఉందన్నారు.

కష్టానికి గుర్తింపే మహిళా దినోత్సవం


మహిళా ఎస్ఐను సన్మానిస్తున్న ఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 6 : మహిళల కష్టానికి గుర్తింపుగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఎంతో ఆనందదాయకమని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా మహిళా పోలీస్ సిబ్బందితో కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులు, మహిళా అధికారులు, సిబ్బందిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఎస్పీ మేరీ ప్రశాంతి దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఒక కార్మిక ఉద్యమం నుంచి పుట్టుకు వచ్చిందని ఎంతో మహిళలు తమ హక్కుల కోసం పోరాటాలు చేశారన్నారు. తమ హక్కుల కోసం చేసిన పోరాటాల ఫలితమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం 1908లో న్యూయార్కు సిటీకి చెందిన 15 వేల మంది మహిళలు తమకు పని గంటలను తగ్గించాలని, పురుషులతో సమానమైన జీతాన్ని ఇవ్వాలని, ఓటు వేసే హక్కును కల్పించాలని ప్రదర్శన నిర్వహించారన్నారు. తొలిసారిగా 1911లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారన్నారు. ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్, అమెరికా ఇలా పలు దేశాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రారంభమైందన్నారు. 1975లో ఈ దినోత్సవాన్ని అధికారికంగా ఐక్యరాజ్య సమితి ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ స్వరూపరాణి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు


జడ్పీ డిప్యూటీ సీఈవోను సత్కరిస్తున్న జేఏసీ నాయకులు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 6 : ఏపీ జేఏసీ-అమరావతి జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవా రం రెవెన్యూ భవన్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్, రెవెన్యూ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్యశాఖ, పౌర సరఫరాల శాఖ ప్రభుత్వ విభాగాల ఉద్యోగినులు హాజరయ్యారు. జడ్పీ డిప్యూటీ సీఈవో నిర్మలజ్యోతి మాట్లాడుతూ మహిళా స్వేచ్ఛ, సాధికారత గురించి వివరించారు. విధి నిర్వహణలో విజయవంతంగా రాణించాలని సూచించారు. ఏపీజేఏసీ-అమరావతి జిల్లా కార్యదర్శి ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ అన్ని రంగాల్లోను పురుషులతో సమానంగా మహిళా ఉద్యోగులు ఉన్నత స్థాయిలో లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఇటీవల మహిళా ఉద్యోగులకు నిర్వహించిన ఆటలు, పాటల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, మెడికల్ ఆఫీసర్ ఉదయబాను, జేఏసీ మహిళా విభాగం చైర్‌పర్సన్ ఆర్.వి.బి.టి.సుందరి, కో-చైర్‌పర్సన్ యు.యామిని, సెక్రటరీ జనరల్ బి.గీతిక, అసోసియేట్ చైర్‌పర్సన్ శాంతకుమారి, స్టేట్ సెక్రటరీ జి.జ్యోతి, కోశాధికారి భవ్య, కార్యదర్శి రూస్సీలక్ష్మీబాయ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై అకృత్యాలు

ఎనిమిదేళ్ల సోదరుడి కుమార్తెతో పెదనాన్న అసభ్యకర ప్రవర్తన

ఏలూరు క్రైం, మార్చి 6 : ఏలూరు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పలువురి చిన్నారులపై అత్యాచారయత్నాలు జరిగాయి. ఎనిమిదేళ్ల చిన్నారిపై ఆమె పెదనాన్న అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఏలూరు దిశ పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. నగరంలోని ఓ ప్రాంతానికి చెందిన ఒక మహిళలకు ఇద్దరు కుమార్తెలు. ఆమె భర్త దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ ఏ పనికి వెళ్ళకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆ మహిళ అక్క ఇల్లు సమీపంలో ఉండడంతో ఆమె ఇద్దరు పిల్లలు తరచూ అక్కడ వెళ్లి అక్కకు వున్న ముగ్గురు పిల్లలతో కలిసి ఆటపాటలతో ఆనందంగా నడుపుతున్నారు. గత ఏడాది డిసెంబర్ 23న క్రిస్మస్ సెలవులు నిమిత్తం ఆ ఇద్దరు చిన్నారులు పెద్దమ్మ ఇంటికి వెళ్లారు. వేకువజామునే పిల్లలంతా లేచి చలిమంటలు కాగుతుండగా ఎనిమిదేళ్ల చిన్నారి మాత్రం ఇంటి హాలులో ఒంటరిగా పడుకుంది. ఆ సమయంలో అక్కడే వున్న ఆ చిన్నారికి పెదనాన్న వరుసయ్యే వ్యక్తి నిద్రపోతున్న బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటనపై బాలిక తల్లి అప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటే ఆమె అక్క కాళ్లావేళ్లా పడి విషయాన్ని మరుగున పెట్టేశారు. విషయం ఆలస్యంగా ఆ బాలిక బంధువులకు తెలియడంతో వారు వచ్చి ఈ నెల 5న గొడవ చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఏలూరు దిశ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయడంతో సీఐ విశ్వం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగ బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

దివ్యాంగ బాలికకు జామ పండు ఇస్తానని నమ్మబలికి ఓ వృద్ధుడు పట్టపగలు ఇంటి పక్కకు తీసుకువెళ్ళి అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. అటు వెళ్తున్న ఇద్దరు చూసేటప్పటికి ఆ వృద్ధుడు పారిపోయాడు. బాలిక ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి బుధవారం కేసు నమోదు చేశారు. నగరానికి చెందిన ఒక దివ్యాంగబాలిక (14) బుధవారం మధ్యాహ్నం బయటకు వెళుతుండగా అక్కడే ఉన్న పెద్దింటి కనకారావు అనే వృద్ధుడు(70) జామపండు ఇస్తానని ఇంటి పక్కకు పిలిచి అత్యాచారానికి వడిగట్టాడు. అటు వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు చూడడంతో కనకారావు పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలు తన కుటుంబసభ్యులతో వచ్చి ఏలూరు రూరల్ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై ఇంటర్ విద్యార్థుల అత్యాచారం

చాట్రాయి, మార్చి 6 : చాట్రాయిలో మానసిక దివ్యాంగురాలైన యువతి(21)పై ఇద్దరు ఇంటర్ విద్యార్థులు అత్యాచారం చేసినట్లు బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ కేసీ హెచ్ స్వామి కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం తండ్రి తొమ్మిదేళ్ల క్రితం చనిపోగా, తల్లి నిత్యం కూలి పనులకు వెళుతుండటంతో బాధితురాలు ఒంటరిగా ఇంటి దగ్గర ఉంటున్నది. మంగళవారం తల్లి ఇంటికి వచ్చిన సమయంలో నిందితులు కుమార్తెపై అసభ్యంగా ప్రవర్తిస్తుండగా కేకలు వేయడంతో పారిపోయారని బాధితురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొంది. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి : ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, మార్చి 6: ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. సైబర్ క్రైమ్ నివారణ కోసం ప్రజలను అప్రమత్తం చేయడానికి తయారుచేసిన గోడ పత్రికను ఏలూరు రేంజ్ కార్యాలయంలో ఐజీ ఆవిష్కరించి మాట్లాడారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, ప్రాసెసింగ్, రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాలని నమ్మబలికి డబ్బులను వసూలు చేస్తున్నారన్నారు. ఉద్యోగులు, గృహిణులు ఇంటి వద్ద ఉంటూ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ అదనపు ఆదాయం సంపాదించవచ్చు అంటూ వస్తున్న ప్రకటనలను చూసి మోసపోవద్దన్నారు. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు వస్తాయని వేలల్లో పెట్టుబడి పెడితే లక్షల్లో లాభాలు అంటూ వచ్చే వాట్సప్, టెలిగ్రామ్ ప్రకటనలు నమ్మకూడదని సూచించారు. లాటరీ వచ్చిందని వచ్చే కాల్స్, మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ప్రజలు సైబర్ నేరాలకు గురైతే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలని, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి, ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులు, ఏలూరు సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ బిహెచ్ వెంకటేశ్వర్లు, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కాగితపు శ్రీనివాసరావు, సైబర్‌సెల్ ఎస్ఐ మధురాజు పాల్గొన్నారు.



పోలీస్ జాగిలం డాన్ మృతి

ఏలూరు క్రైం, మార్చి 6 : పోలీస్ శాఖలో 12 సంవత్సరాల పాటు సేవలందిస్తూ కీలకమైన కేసులను ఛేదించిన పోలీస్ జాగి లం డాన్ అనారోగ్యంతో బుధవా రం ఉదయం మృతి చెందింది. 2013 జూలై 1న జన్మించిన డాన్ జిల్లా పోలీస్ శాఖలో చేరింది. 2018లో శిక్షణ పొందిన డాన్ శిక్షణలోనే గోల్డ్‌మెడల్ సాధించింది. డాన్ జాగిలం హ్యాండ్లర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ షరీఫ్ వ్యవహరిస్తున్నారు. ఈ జాగిలం చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో జరిగిన జంట హత్యకేసులను ఛేదించింది. ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక హత్య కేసును ఛేదించింది. పోలీస్ జాగిలం మృతదేహంపై ఎస్పీ మేరీ ప్రశాంతి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అదనపు ఎస్పీ స్వరూపరాణి, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ఆర్ఐ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాల కేసులో వైసీపీ నేతల ఒత్తిళ్లు

పెనుమంట్ర, మార్చి 6 : భట్లమగుటూరు వీఆర్వో నాగేశ్వరి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆరు సెంట్ల స్థలాన్ని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఈదా అనిత భర్త ప్రవీణ్ తప్పుడు సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్న ఘటనపై కేసు కట్టకుండా ప్రజా ప్రతినిధులు పోలీసులపై ఒత్తిడి చెయ్యటం దారుణమని, రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీందరరాజు అన్నారు. పార్టీ నాయకుడు ఫోర్జరీ సంతకాలు చేసినట్లు స్పష్టంగా కనబడుతున్నా నిందితులను కాపాడేందుకు వైసీపీ నేతలు అడ్డుపడటం దారుణమన్నారు. ఫిర్యాదు చేసిన ఉద్యోగిని నాగేశ్వరిపై కొందరు నేతలు రూ.లక్షా 50 వేలు లంచం అడిగారని ఇవ్వనందుకే ఫిర్యాదు చేశారని ప్రచారం చేయటం శోచనీయమన్నారు. ఫోర్జరీ సంతకం చేసిన వారిపై కేసు నమోదు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

20 మందికి కుక్కకాటు

నరసాపురం, మార్చి 6: పట్టణంలో బుధవారం పిచ్చికుక్క స్వైర్య విహారం చేసింది. ఆర్టీసీ బస్టాండ్ నుంచి మల్లవరం వరకు 20 మందిని గాయపర్చింది. బస్టాండ్ వద్ద వృద్ధుడ్ని గాయపర్చింది. భయభ్రాంతులైన ప్రజలు దానిని కొట్టే ప్రయత్నం చేశారు. గాంధీనగర్, పంజాసెంటర్, పీచుపాలెం, అక్కడ నుంచి మళ్లీ చినమామిడిపల్లి, సరిపల్లిలో రహదారిపై వెళుతున్న వారిని గాయపరిచింది. క్షతగ్రాతులు ప్రభుత్వ అస్పత్రికి వెళ్లారు. వైద్యులు చికిత్స చేసి వ్యాక్సిన్‌లు వేశారు. వెంటనే ఆస్పత్రి సూపరిడెండెంట్ సుప్రీయ విషయాన్ని కమిషనర్ వెంకటేశ్వరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ శానిటరీ సిబ్బందిని కుక్కను పట్టుకోమని ఆదేశించారు. సిబ్బంది మూడు బృందాలుగా గాలించినా కుక్క ఆచూకి చిక్కలేదు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య


ఏలూరు క్రైం, మార్చి 6 : అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడింది. కొమడవోలుకు చెందిన మంచినీళ్ళ శివదుర్గ (35)కు భర్త నాగరాజు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొంత కాలం నుంచి ఫిట్స్ వ్యాధితో శివదుర్గ బాధపడుతుంది. ఎన్ని మందులు వాడినా ఫిట్స్ తగ్గకపోవడంతో ఈనెల 5న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబ సభ్యులు వచ్చేటప్పటికి ఆమె మృతి చెందింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పద మృతి గా కేసు నమోదు చేసి, పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు.

పాస్టర్ల సమావేశం రసాభాస

టోకెన్లు ఇచ్చి నగదు ఇవ్వలేదంటూ ఆరోపణ

ఏలూరు టూ టౌన్/పెదపాడు, మార్చి 6 : ఏలూరు జిల్లావ్యాప్తంగా వున్న పాస్టర్లకు పాస్టర్స్ కాన్ఫరెన్స్ పేరిట పెదపాడు మండలం వట్లూరు క్రాంతి కళ్యాణవేదిక వద్ద నిర్వహించిన సమావేశం బుధవారం రసాభాసగా మారింది. ప్రసంగికుల దైవ సందేశం అందించారు. ఉదయం 11 గంటలలోపు వచ్చి పేరు నమోదు చేయించుకున్న వారికి ప్రత్యేక బహుమతితోపాటు ప్రేమవిందు కలదని స్థానిక పాస్టర్లు, నాయకుల పేరుతో కరపత్రాలను ముద్రించారు. ప్రత్యేక బహుమతితోపాటు వెయ్యి రూపాయలు ఇస్తామనడంతో మూడు వేల మంది వరకు పేర్లు నమోదు చేసుకోగా వారికి నిర్వాహకులు టోకెన్లు అందించారు. వక్తల ప్రసంగం ముగిసిన తర్వాత టోకెన్లు తీసుకుని నగదును కొద్ది మందికే ఇచ్చి ఆపివేయడంతో గందరగోళంగా మారింది. ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ పలువురు పాస్టర్లు నినాదాలు చేశారు. కొంత మంది నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. కల్యాణ వేదిక ముందు మినీ బైపాస్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ప్రత్యేక బహుమతి అందజేస్తామని పేర్కొనడంతో వ్యయ ప్రయాసలకోర్చి ఇక్కడకు వచ్చి నిలువు కాళ్ల మీద నిలబడాల్సి వచ్చిందని, టోకెన్లు ఇచ్చిన వారికి నగదు ఇవ్వకుండా నిర్వాహకులు మొహం చాటేశారంటూ పలువురు పాస్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు.


నిర్వాహకులు, పాస్టర్లతో మాట్లాడుతున్న పోలీసులు


పోలవరం మహానందీశ్వర స్వామి ఆలయం


పెదవేగిలోని పురాతన శివాలయం


చింతలపూడి వేగిలింగేశ్వరాలయం


రెడ్డిగణపవరం విశ్వేశ్వరాలయం


ఆసన్నగూడెం ఆలయంలో నాగేశ్వరస్వామి

శంభో శంకర

మహా శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

చింతలపూడి, మార్చి 6: మహా శివరాత్రి ఉత్సవాలకు శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. పలు ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం, అభిషేకాలు, పూజలు, కల్యాణానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. చింతలపూడి వేగిలింగేశ్వరస్వామి ఆలయం చాలా పురాతనమైంది. వేంగి రాజుల కాలంలో దీనిని ప్రతిష్ఠించారని చారిత్రక ప్రసిద్ధి. మండలంలోని పోతునూరు, గురుభట్లగూడెం శివాలయాలు ఒకేసారి ప్రతిష్ఠించారని చెబుతుంటారు. చింతలపూడి ఆలయాన్ని వేగి లింగేశ్వరస్వామి ఆలయంగా పిలుస్తారు. ఆలయంలో శివలింగం, పార్వతీ విగ్రహాలను వేంగిరాజులు ప్రతిష్ఠించారు. వేగిలింగేశ్వరాలయ వివరాలు అమరావతిలోని శివాలయంలో లిఖింపబడ్డాయని పెద్దలు చెబుతారు. గురుభట్లగూడెం శివాలయం జీర్ణోద్ధారణ జరుగుతుంది. పోతునూరులోని శివాలయం జీర్ణోద్ధారణకు నిధులు మంజూరయ్యాయి.

● లింగపాలెం: మండలంలోని ఆసన్నగూడెంలో గంగా పార్వతి సమేత నాగేశ్వరస్వామి ఆలయానికి 125 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికుల కథనం. గ్రామానికి చెందిన తాడికొండ వెంకట సుబ్బయ్య భార్యతో కలసి కాశీ యాత్రలకు వెళ్లి వస్తుండగా అతడి భార్య ఒక చిన్నరాయి తీసుకుని బయల్దేరినట్లు చెబుతారు. ఇంటికి వచ్చేలోపు రాయి బరువు పెరగడంతో మోయలేక వదిలేసినట్లు కథనం. సుబ్బయ్యకు శివుని రూపం కనిపించి రాయి వదిలిన ప్రదేశంలో గుడికట్టించమని కోరినట్లు స్థానికులు చెబుతారు. చిన్నపాక వేసి పూజలు పెట్టగా మహిమాన్విత ఆలయంగా ప్రసిద్ధి పొందింది. దిగవల్లి సుబ్బమ్మ అనే మహిళ 30 ఎకరాలు భూమి స్వామివారికి రాసినట్లు పూజారి తెలిపారు. ఆలయాన్ని 2010లో దేవదాయ శాఖ ఆధీనంలోకి తీసుకుంది.

● పోలవరం: మహా శివరాత్రి పర్వదినంలో మహానందీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ సేవక బృందం బుధవారం తెలిపింది. పోలవరం ప్రాజెక్టు ఎగువ దిగువ కాపర్ డ్యాం, స్పిల్‌వే నడుమ ఉన్న అతి ప్రాచీన మహానందీశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 8న రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ, లింగోద్భవ సమయంలో అభిషేకాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

● బుట్టాయగూడెం: 11వ శతాబ్దానికి పూర్వం ఒక వెలుగు వెలిగిన రెడ్డిరాజుల సామ్రాజ్యానికి కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆరాధ్య దైవం. శివభక్తులైన రెడ్డిరాజులు తమ విజయాలకు సూచికగా రెడ్డిగణపవరంలోని కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయం, 101 చోట్ల శివాలయాలను ఏర్పాటు చేసి నిత్యం పూజలు చేసేవారు. ముస్లింల దండయాత్రలతో శిథిలమైన స్వామి ఆలయాన్ని 1125లో భౌమరాజు రామకృష్ణంరాజు, భౌమరాజు సేతురత్నం రాజులు గిరిజనులు, పెద్దల సహకారంతో పునఃనిర్మాణం చేశారు. ఏటా హోలీ పూర్ణిమ రోజు నుంచి ఐదు రోజులు ఉత్సవాలను నిర్వహిస్తారు. మూడో రోజున అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామివానికి వైభవగం కళ్యాణం నిర్వహిస్తారని, ఆలయ ధర్మకర్త భౌమరాజు ధనుంజయరాజు తెలిపారు.

● పెదవేగి: స్థానిక శివాలయం వేంగీ రాజుల కాలంలో నిర్మించినట్లు కొన్ని శాసనాలు చెబుతున్నాయి. ఆరవ శతాబ్దంలో వేంగిరాజు రాజరాజ నరేంద్రుడు ఈ శివాలయాన్ని నిర్మించినట్లు పురాణగాథ. రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి నన్నయ భట్టారకుడు ఈ శివాలయంలో భారతంలోని మిగిలిన ఆదిపర్వాన్ని తెలుగులోకి అనువదించాడని నానుడి. వేంగీ రాజుల కాలంనాటి శిల్పకళా చాతుర్యాన్ని తెలిపే కళాఖండాలు ఇప్పటికీ శివాలయం ఆవరణలో పురావస్తు శాఖ సిబ్బంది పర్యవేక్షణలో భద్రపరిచారు. శివాలయాన్ని 35 ఏళ్ల క్రితం పొన్నూరు శంకర్‌గౌడ్ అనే వ్యక్తి మరమ్మతులు చేయించారని చెబుతారు.

● ఉంగుటూరు: స్థానిక భీమేశ్వరాలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పత్తిపాటి దుర్గారావు, ఆలయ ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు.

ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదు : ఎమ్మెల్యే ఎలీజా


శిలాఫలకంపై తన ఫొటో లేదంటున్న ఎలీజా

లింగపాలెం, మార్చి 6: నియోజకవర్గంలో పార్టీ నేతలు కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఇలాగే కొనసాగితే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. ఆసన్న గూడెంలో సచివాలయం, ఆర్బీకే భవనాలను ఎమ్మెల్యే ఎలీజా బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు ఉద్దేశపూర్వకంగా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. యడవల్లిలో బీటీ రోడ్డు నుంచి యర్రవారిగూడెం వరకు ఎంపీ నిధులతో రోడ్డు నిర్మాణ శిలాఫలకంపై తన ఫొటో కావాలని తొలగించారన్నారు. నియోజకవర్గంలో తనను తన పార్టీ నాయకులే ఎన్నో సార్లు అవమానించారన్నారు. అధికారులు కూడా తనకు తెలియకుండా రహదారులు, నూతన ప్రభుత్వ కార్యాలయాలను ఇన్‌చార్జిలతో ప్రారంభింపజేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, పార్టీ నేతల తీరు ఇలాగే ఉంటే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి పాలయ్యే అవకాశం ఉందన్నారు. కొందరు నాయకులు మాట్లాడుతూ తాము ఎమ్మెల్యే ఎలీజాతో ఉంటామని, అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవిస్తామన్నారు.

ఆసన్నగూడెంలో ఎమ్మెల్యే ఎలీజాతో పాటు పాల్గొన్న యడవల్లి సర్పంచ్ కట్టు బోయిన రమేష్ మాట్లాడుతూ అధికారులు, నాయకులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని, గ్రామ ప్రథమ పౌరుడైన తనను పక్కనపెట్టి వారు మాత్రమే ప్రారంభోత్సవాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ జగన్నాథరావును వివరణ కోరగా ప్రారంభోత్సవాల విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు.

తపాలా సేవలు, పథకాలు ప్రజలకు చేరాలి


మాట్లాడుతున్న తపాలా ఏడీ ఎలమందయ్య

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 6: తపాలా శాఖ సేవలు, పథకాలు ప్రజలకు చేరాలని విజయవాడ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ యు. ఎలమందయ్య అన్నారు. డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం తపాలాశాఖ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. తపాలా విజయవాడ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ యు.ఎలమందయ్య మాట్లాడుతూ తపాలా పొదుపు ఖాతాలు, పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రతీ ఉద్యోగి అంకితభావంతో ప్రయత్నించాలని సూచించారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన రిజిస్ట్రేషన్‌చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ నెలలో ఏలూరు జిల్లాలో కనీసం 24వేల రిజిస్ట్రేషన్లు చేయాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. హెడ్ పోస్టుమాస్టర్ గంగాధరరావు మాట్లాడుతూ ప్రతీ ఇంటికి ఉచిత సౌరశక్తి ఫలకాల పథకంలో 300యూనిట్ల ఉచిత విద్యుత్‌లభిస్తుందని వివరించారు. వివరాలకు పోస్టుమ్యాన్‌ను, లేదా పోస్టాఫీసుల సూపరింటెండెంట్ కార్యాలయ ఫోన్‌నెంబరు 08812-230053లోగాని సంప్రదించాలని సూచించారు. పోస్టల్ సూపరింటెండెంట్ బి.అంబేడ్కర్ రాజు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.శ్రీనివాసరావు, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు జి.దుర్గారావు, డి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు భద్రత కల్పించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 6 : కోట్లాది మంది హమాలీలకు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కె.వి.రమణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ టింబర్ డిపో హమాలీల సమావేశం ఎడ్లపల్లి బుజ్జియ్య అధ్యక్షతన బుధవారం జరిగింది. రమణ మాట్లాడుతూ గతంలో కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి బండారు దత్తాత్రేయ కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పిస్తామని వాగ్దానం చేశారని, ఇంతవరకు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ముఖ్యంగా పని భద్రత ఉపాధి భద్రత కూడిన సమగ్ర చట్టం వెంటనే చేయాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎడ్లపల్లి సుబ్బారావు పి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇచ్చి ఆదుకోండి.. విద్యుత్ ఉద్యోగుల వేడుకోలు


సబ్‌స్టేషన్ వద్ద ఉద్యోగుల నిరసన

వేలేరుపాడు, మార్చి 6: జీతాలు చెల్లించకుండా ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని కోయిదా ఫీడర్ల పరిధిలో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మార్చి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వేతనాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని జూనియర్ లైన్మెన్లు సోడే నాగేశ్వరరావు అభిమన్యు రెడ్డి సాగర్ బాబురావు భద్రయ్య నరసింహమూర్తి మునేష్ చెల్లం మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. 2017 నుంచి విద్యుత్ శాఖలో పనిచేస్తున్న తమకు గత ఏడాది వరకు వేతనాలు సక్రమంగానే అందాయని, 12 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారిందన్నారు. విద్యుత్ శాఖ జంగారెడ్డిగూడెం డీఈ, ఏలూరు ఎస్ఈకి విన్నవించామన్నారు. ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.

త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ : కలెక్టర్

ఏలూరు సిటీ, మార్చి 6: ఓటర్ల జాబితాలో మార్పుల క్లైయిమ్‌లు రెండు రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. త్వరలో సాధారణ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని, ఓటర్ల జాబితా మార్పులపై దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. జిల్లాలో సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ఠ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పూర్తిస్థాయి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ బి లావణ్యవేణి, డీఆర్వో డి.పుష్పమణి, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, కలెక్టరేట్ ఏఓ కె కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఓటుపై అవగాహన సదస్సు

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 6: విద్యార్థులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులందరికీ కూడా ఓటు ప్రాముఖ్యతను వివరించాలని తహసీల్దార్ స్లీవజోజి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్ బాబు అధ్యక్షతన ఓటు సద్వినియోగం పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మడకం స్వాతి, పసుపులేటి అమూల్య, కేవీవీ.శిరీష, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ఎన్నో చట్టాలు


సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, మార్చి 6 : మహిళల అభివృద్ధి, రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయాధికారి రత్నప్రసాద్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు స్త్రీ సాధికారతపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. న్యాయసహాయం కావాల్సిన వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. బాలికలకు నాణ్యమైన, ఉన్నతమైన విద్యనందించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు. జిల్లా పరిధిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు ఉంటాయని మహిళా ఉద్యోగినులకు ఇబ్బందులు ఎదురైనా ఆయా కమిటీల ముందు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. మహిళా కార్మికులకు పురుషులతో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కె.నాగేశ్వరరావు, ప్యానల్ అడ్వకేట్ పి సుబ్బారావు, కూనా కృష్ణారావు, మునీశ్వరరావు, వినియోగదారుల ఫోరమ్ కె.శ్రీనాగలక్ష్మి, సీడీపీవో విజయలక్ష్మి పలువురు పాల్గొన్నారు.

మనువాద పాలనకు బీజేపీ యత్నం

ఏలూరు టూటౌన్: దేశంలో మనువాద పాలన తీసుకురావాలని బీజేపీ ప్రయత్నిస్తుందని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ.హైమావతి, శ్యామలరాణి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అన్నేభవన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ విధానాలను మహిళలంతా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో జె.హరీషదుర్గ, ఉషారాణి, ఎస్‌కే సైదాని, స్వర్ణలత, వెంకటరమణ, కనకదుర్గ, ఇందిర పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం : జేసీ

ఏలూరు రూరల్: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని జేసీ బి లావణ్యవేణి అన్నారు. పోలీస్ కల్యాణ మండపంలో ఐసీడీఎస్, ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జేసీ బి.లావణ్యవేణి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజను సత్కరించారు. ఐసీడీఎస్ పీడీ పద్మావతి, డిప్యూటి కలెక్టర్ భానుశ్రీ, జడ్పీ డిప్యూటి సీఈవో ఎస్.నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కేటాయించాలని నిర్వాసితుల ధర్నా


ఐటిడిఏ వద్ద ధర్నా చేస్తున్న నిర్వాసితులు

బుట్టాయగూడెం, మార్చి 6: కుక్కునూరు మండలం మద్రిపాడులో ఇళ్లు కేటాయించాలని, పునరావాస పరిహారం చెల్లించాలని కోరుతూ ఐటీడీఏ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గిరిజన నిర్వాసితులు బుధవారం ధర్నా చేశారు. మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ మద్రిపాడులో కొత్తూరు నిర్వాసితులకు కేటాయించిన ఇళ్లను వారికే ఇవ్వాలన్నారు. నిర్వాసితుల కాలనీలో విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. యర్నం సాయికిరణ్, ఊయికె ముత్తయ్య, సోడే సత్యవతి, మిడియం తిరపతమ్మ, కొండ్రూ బాబు గిరిజన నిర్వాసితులు పాల్గొన్నారు. పీవో ఎం.సూర్యతేజకు వినతిపత్రాన్ని అందజేశారు. ఇళ్ల సమస్యను పరిష్కారిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతి

బుట్టాయగూడెం, మార్చి 6: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అర్హులైన ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలుగా 16 మందికి పదోన్నతి కల్పిస్తూ పీవో ఎం.సూర్యతేజ బుధవారం ఉత్తర్వులను అందజేశారు. స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెచ్‌ఎం గ్రేడు-2గా పదోన్నతులు ఇవ్వడం జరిగిందని అధికారి తెలిపారు.

హోంగార్డుల సమస్యలు తెలియజేయండి : ఎస్పీ


చెక్కు అందజేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 6: మృతిచెందిన హోంగార్డు కుటుంబాల సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ మేరీ ప్రశాంతి సూచించారు. జిల్లా హోం గార్డు విభాగంలో పనిచేస్తూ 2022 డిసెంబర్ 17న అనారోగ్యంతో మరణించిన ఐ మధుసూదనరావు (హెచ్‌జి 588) కుటుంబానికి సంక్షేమ నిధి నుంచి వచ్చిన నగదు చెక్కును రూ.5,47,410 ఆయన సతీమణి సత్యవతికి ఎస్పీ అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఏఆర్ ఆర్‌ఐ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

11న ప్రభుత్వ ఐటీఐలో అప్రంటీస్ మేళా

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 6 : కేంద్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పీఎం నామ్ అప్రంటీస్‌షిప్ మేళా ఈ నెల 11న సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో జరుగుతుందని ప్రిన్సిపాల్ పి.రజిత బుధవారం తెలిపారు. ప్రముఖ కంపెనీలు హాజరయ్యే ఈ మేళాలో ఎస్ఎస్‌సీ పాస్/ఫెయిల్, ఐటీఐ, డిప్లమో లేదా ఏదైనా వృత్తివిద్యాకోర్సుచేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చునని వివరించారు. వివరాలకు ఐటిఐ కార్యాలయ ఫోన్‌నెంబరు 08812-230269లో సంప్రదించాలని కోరారు.





కె.జగ్గవరం, మక్కినవారిగూడెం, మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ సమావేశాల్లో మాట్లాడుతున్న వాసిరెడ్డి మధు, పిన్నమనేని చక్రవర్తి, దాసరి రాంబాబు

రైతు సంక్షేమానికి సహకార సంఘాలు

టి.నరసాపురం, మార్చి 6 : రైతు సంక్షేమానికి సహకార సంఘాలు కృషి చేస్తాయని అధ్యక్షుడు అన్నారు. మండలంలోని కె.జగ్గవరం సొసైటీ మహాజన సభ చైర్ పర్సన్ వాసిరెడ్డి మధు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. మధు మాట్లాడుతూ రైతులు, సంఘ సభ్యులు సహకారంతో సొసైటీ అభివృద్ధిలో ముందుందన్నారు. రైతులకు రూ.49కోట్ల రుణాలు అందించామని రూ. 4 కోట్లు డిపాజిట్లు ఉన్నాయన్నారు. వంటిపల్లి వెంకటేశ్వరరావు, భీమవరపు జగన్మోహనరావు, సీఈవో తనగాల వీర వెంకయ్య, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, వెలిది గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

● మక్కినవారిగూడెం సొసైటీ మహాజన సభలో చైర్‌పర్సన్ పిన్నమనేని చక్రవర్తి మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు రైతు నేస్తం పథకంలో రూ.3.80 లక్షలు రైతులకు అందజేసినట్లు తెలిపారు. 200 మందికి టుబాకో బోర్డు ద్వారా రుణాలు మంజూరు చేశామని తెలిపారు. బండివారిగూడెంలో మల్టీపర్పస్ గోడౌను ప్రారంభిస్తామన్నారు. దాసరి రాంబాబు, మందలపు మూర్తి, మెతుకుమెల్లి గోపాలరావు, ఆచంట సూర్యనారాయణ పాల్గొన్నారు.

● మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ మహాజన సభలో చైర్‌పర్సన్ దాసరి రాంబాబు మాట్లాడుతూ రైతుల అవసరాల మేరకు తిరుమలదేవిపేటలో ఎంపీఎఫ్‌సీ గోడౌన్ ఏర్పాటు చేశామన్నారు. రైతులు తీసుకున్న పంట రుణాలు సకాలంలో చెల్లించాలని తెలిపారు. వారికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు అందుతాయన్నారు. కార్యక్రమంలో తమ్మిశెట్టి శ్రీను, తాడేపల్లి నాగ వెంకట సత్యనారాయణ, సీఈవో జి.బుజంగరావు, బసవరాజు, వరికూటి సత్య నారాయణ, బండ్రెడ్డి వెంకట రామారావు, కమ్మ వెంకట రత్నారావు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




పట్టెన్నపాలెం బ్రిడ్జ్‌ను పరిశీలిస్తున్న సొంగా, టీడీపీ, జనసేన నాయకులు, ఏలూరులో బడేటి చంటి ప్రచారం, నిర్వాసితులతో మాట్లాడుతున్న బొరగం

టీడీపీ, జనసేన నేతల విస్తృత పర్యటన

జంగారెడ్డిగూడెం, మార్చి 6: చింతలపూడి నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో సీనియర్ నాయకులను కలుసుకుని అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషును కలసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం మీడియా సమావేశంలో రోషన్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన అధినేతలు బీసీ డిక్లరేషన్ ప్రకటించి బీసీలపై చిత్తశుద్ధి చూపించారన్నారు. అధికార ప్రతినిధి దాసరి శేషు మాట్లాడుతూ బీసీలు టీడీపీ వెంటే ఉంటారని, రానున్న ఎన్నికల్లో విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీనివాసపురం, అక్కంపేట, పట్టెన్నపాలెం, మైసన్నగూడెం, కేతవరం తిరుమలపురం గ్రామాల్లో పర్యటించారు. ప్రజల వద్దకు వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించి రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. మండవ లక్ష్మణరావు, సాయిల సత్యనారాయణ, కుక్కల మాధవరావు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, నంబూరి రామచంద్రరాజు, పగడం సౌభాగ్యవతి, బుసా సత్యనారాయణ, రాగాని రామకృష్ణ, కనపర్తి ఆనందకుమార్, గంటా రామారావు, చెరుకూరి శ్రీధర్, యాతం సురేష్, తదితరులు పాల్గొన్నారు

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : బడేటి చంటి

ఏలూరు టూటౌన్: నియోజకవర్గాన్ని ఎన్నడు లేనంత అభివృద్ధి చేస్తానని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 20వ డివిజన్‌లో ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. ప్రతీ ఇంటింటికి వెళ్ళి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.

నిర్వాసిత కాలనీల్లో మౌలిక సదుపాయాలు : బొరగం

బుట్టాయగూడెం: తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. పెద్దూరు, తెల్లవరం, తూటిగుంట, పైడాకులమామిడి, పల్లపూరు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో బుధవారం పర్యటించారు. తాను కూడా నిర్వాసితుడినేనని, నిర్వాసితుల బాధలు తనకు స్పష్టంగా తెలుసన్నారు. మిడియం వెంకటస్వామి, మడకం బుచ్చిరాజు, బొడ్డు బాపిరాజు, సోదెం బుచ్చిరాజు, చింతల రామిరెడ్డి, కొవ్వాసు సంకురు, కారం సురేష్ పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ బీసీలకు అండగా నిలిచింది తెలుగుదేశం పార్టీయే అన్నారు.


చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న బీసీ నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

చింతలపూడి, మార్చి 6: ప్రగడవరంలో బీసీ సమాఖ్య ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. నాయీ బ్రాహ్మణ సాధికారత కమిటీ జిల్లా కన్వీనర్ కొప్పెర్ల నాగరాజు మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచిన 10 హామీలు ఎంతో ఉపయోగకరమని, 50 ఏళ్లకే పెన్షన్, బీసీలకు రక్షణ చట్టం హామీలు అద్భుతం అన్నారు. బీసీలందరూ టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కొనకళ్ళ వీర్రాజు, సీహెచ్.మోహన్‌రావు, చక్రపు మారేశ్వరరావు, తాళం చెన్నారావు, రాచకొండ రాంబాబు, గార్లపాటి వెంకన్న, చిమట తిరుపతి రావు, బాబూ యాదవ్, కేశవ, రాము తదితరులు పాల్గొన్నారు.

బీసీల రక్షణ చట్టంతో మనోస్థైర్యం



బీసీలకు రక్షణ చట్టం ప్రతిపాదనతో బీసీల్లో మనోస్థైర్యం రెట్టింపైంది. త్వరలో ఏర్పడబోయే టీడీపీ, జనసేన ప్రభుత్వంలో ఏడాదికి రూ. 30 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.1.50 లక్షల కోట్లు బీసీ సబ్‌ప్లాన్ నిధులను బీసీల కోసమే వినియోగించేలా చంద్రబాబు చర్యలు తీసుకోనుండడం బీసీలకు శుభపరిణామం. బీసీలంతా టీడీపీ,జనసేన కూటమి వెంటే ఉంటారు.

- మోరు శ్రావణి, మాజీ ఎంపీపీ, బీసీ నాయకురాలు, పెదపాడు

బీసీ డిక్లరేషన్ వరం



తెలుగుదేశం ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బీసీలకు వరం. నాడు బీసీలను గుర్తించింది ఎన్టీఆర్. చంద్రబాబు హయాంలో ఆదరణ పరికరాలు ఇచ్చారు. వృత్తి రీత్యా పనిచేసే అన్ని కులాలకు ప్రాధాన్యత ఈ డిక్లరేషన్ ద్వారా అందుతుంది. బీసీలకు 50 ఏళ్ళకే పెన్షన్ ఇవ్వడం, బీమా పెంచడం, పది హామీలు బీసీలకు మరపురానివిగా ఉన్నాయి. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి.

- కొమ్మరాజు సత్యనారాయణ, రజక దళం అధ్యక్షుడు, ఊటసముద్రం

బీసీలకు ఎంతో మేలు



బీసీ డిక్లరేషన్‌తో ఎంతగానో మేలు జరుగుతుంది. టీడీపీ, జనసేన అధికారంలోకి వస్తే కార్పొరేషన్‌ను తిరిగి ప్రారంభించి అధికారులు కట్టబెడతామని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించడం శుభ సూచకం. బీసీలకు అధిక ప్రాధాన్యతనిచ్చి వారి అభ్యున్నతికి పాటుపడింది టీడీపీనే. చంద్రబాబు సీఎం అయితే బీసీలకు పూర్వవైభవం వస్తుంది.

- మాటూరి ముసలయ్య, బిసి సంఘం నాయకుడు, బుట్టాయగూడెం

బీసీలకు రక్షణ కవచం



బీసీ రక్షణ చట్టం ఎంతో ఉపయోగపడుతుంది. టీడీపీ, జనసేన బీసీ డిక్లరేషన్ ఎంతో మేలు చేసేదిగా ఉంది. 50 ఏళ్లకే పెన్షన్, రక్షణచట్టం, రాజకీయాల్లో కూడా 34శాతం రిజర్వేషన్ బీసీలను ముందుకు తీసుకువెళ్లడమే. బీసీ ఉపకులాలు అంతా తెలుగుదేశంపార్టీకి అండగా ఉండాలి.

- పిల్లల శ్రీనివాసయాదవ్, బీసీ నాయకుడు, లింగపాలెం

వెనుకబడిన వర్గాలకు సంజీవని



బీసీలకు 50ఏళ్ళకు ఫెన్షన్ రూ.4వేలు, బీసీలకు ప్రత్యేక చట్టం వంటివి బీసీలపట్ల టీడీపీ, జనసేనల చిత్తశుద్ధి స్పష్టం చేస్తోంది. టీడీపీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ వెనుకబడిన వర్గాలకు సంజీవనిలాంటిది. టీడీపీ - జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 34శాతం బీసీ రిజర్వేషన్లు పునరుద్ధరించనుంది. చట్టబద్ధంగా కుల గణన, నిర్ధారణ బీసీల విద్యాపథకాలు పునరుద్ధరణ హర్షణీయం.

- చుక్కా వెంకటేశ్వరరావు, జాలిపూడి, ఏలూరు రూరల్ మండలం

బీసీ డిక్లరేషన్ భేష్



బీసీ డిక్లరేషన్ బీసీల సామాజిక ఆర్థిక రాజకీయ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది. 50 ఏళ్లకే పెన్షన్ చారిత్రాత్మక నిర్ణయం. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడం శుభసూచకం. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం పునరుద్ధరిస్తామనడం చారిత్రాత్మకం.

- సిరిబత్తిన కొండబాబు, బీసీ నాయకుడు, భీమడోలు

కుటుంబ పోషణకు ఉపాధి కల్పించండి

బుట్టాయగూడెం, మార్చి 6: భార్య చనిపోవడంతో నలుగురు పిల్లల పోషణ భారంగా మారిందని, తనకు ఉపాధిని కల్పించాలని కోరుతూ ఐటీడీఏలో బుధవారం జరిగిన గిరిజన దర్బార్‌లో సంగం ముత్యాలరావు పీవో ఎం. సూర్యతేజ వద్ద గోడు వెళ్ళబోసుకున్నాడు. తన భార్య కుంజం సీతారత్నం తెల్లవరం పీహెచ్‌సీలో సెకండ్ ఏఎన్ఎంగా పనిచేస్తూ ఫిబ్రవరి 23న గుండెపోటుతో మరణించినట్లు పీవో దృష్టికి తెచ్చారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్‌తో పరిశీలించాలని పీవో సూచించారు. జీలుగుమిల్లి మండలం యర్రవరం నిర్వాసితుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, 5 ఎకరాలకు బోరును కేటాయించాలని, చేతిపంపులు ఏర్పాటు చేయాలని, మహిళలకు కుట్టుశిక్షణ ఇవ్వాలని నిర్వాసితులు వినతిపత్రం ఇచ్చారు. అధికారులు అర్జీలను సత్వరమే పరిష్కరించాలని పీవో ఆదేశించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పెనుమత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన బుధవారం సమావేశం మొక్కుబడిగా సాగింది. గ్రామాల్లో సమస్యలు ప్రజా ప్రతినిధులు వివరించారు. వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ప్రగతి నివేదిక వినిపించారు.
- **ఏలూరు క్రైం :** ఏలూరు బాలయోగి వంతెన ప్రాంతంలో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న టూటౌన్ ఎస్ఐ ప్రభాకర్‌కు సమాచారం అందడంతో తన సిబ్బందితో దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.50,210 స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.
- **చింతలపూడి :** అల్లిపల్లి లో కొబ్బరి చెట్లకు వ్యాపించే నల్లముట్టు పురుగు నివారణకు శాస్త్రవేత్తలు సూచనలు ఇచ్చారు. అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త అనూష మాట్లాడుతూ కొబ్బరి ఆకుల రసాన్ని పీల్చే ఈ నల్లముట్టు పురుగుల నివారణకు బ్రకాన్, గోనియాజుస్ బదలికలు అనే పురుగులను ప్రయోగించాలని, వీటి ద్వారా నల్లముట్టు పురుగుల నివారణ జరుగుతుందని సూచించారు.
- **పెదపాడు :** వట్లూరులోని సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. స్పీకర్, పార్లమెంట్ సభ్యులుగా విద్యార్థినులు ప్రశ్నోత్తరాల సమావేశాన్ని నిర్వహిచారు. ప్రిన్సిపాల్ శైలజ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.
- **బుట్టాయగూడెం :** మహిళలంతా పీఎం విశ్వకర్మ కౌశల్ యోజన సద్వినియోగం చేసుకోవాలని ప్రధాని మోదీ కోరారు. నారీ శక్తివందన్ కార్యక్రమాన్ని డిజిటల్ స్క్రీన్ ద్వారా మహిళలకు చూపించారు.
- **భీమడోలు :** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పారామిలటరీ ఫోర్స్, పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ బిబి రవికుమార్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎస్ఐ వై సుధాకర్, ఎఎస్ఐ చలపతిరావు, సచివాలయ మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.
- భీమడోలు మండలం గుండుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలను ఏపీ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ పరిశీలించారు. గుండుగొలను హైస్కూలులో మొదటి దశ నాడు నేడు పనులను, పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకాన్ని, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులకు కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలపై ఆరా తీశారు.

భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

కలిదిండి, మార్చి 6 : కలిదిండిలో పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. స్వామివారిని పెండ్లి కుమారుడు, పార్వతీ అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి పూజలు చేశారు. గీతా పారాయణం, శివపురాణం, హరి కథా కాలక్షేపం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ చైర్మన్ అడివి వెంకట గంగాధర శర్మ, సొసైటీ చైర్మన్ వడుపు రామారావు, ధర్మకర్తలు చెరుకువాడ బాలరామరాజు, చిట్టూరి కృష్ణ ప్రసాద్, నంబూరి రామరాజు, కె.సుబ్బలక్ష్మి, లక్ష్మీకుమారి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బలివేకి మూల్పూరి ట్రస్ట్ ఉచిత బస్సులు

నూజివీడు టౌన్, మార్చి 6: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నూజివీడు నుంచి బలివే పుణ్యక్షేత్రానికి మూల్పూరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రెండు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు నూజివీడు మూల్పూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మూల్పూరి లక్ష్మణస్వామి తెలిపారు. శివరాత్రి రోజు నూజివీడు, ముసునూరు మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి రెండు ప్రత్యేక బస్సు సర్వీసులను ట్రస్ట్ ద్వారా ఉచితంగా నడుపుతున్నట్లు భక్తులు ఈ సర్వీసులను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

హరియా తండాలో శక్తివందన్ రన్

నూజివీడు టౌన్, మార్చి 6: నారీ శక్తి వందన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నూజివీడు మండలం హరియా తండా, ఓగిరాల తండా గ్రామాల్లో శక్తివందన్ రన్ కార్యక్రమాన్ని బుధవారం నూజివీడు మండల బీజేపీ అధ్యక్షుడు గొగినేని శ్రీనివాసకుమార్ అప్పారావు, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు సౌభాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవ్వగా, కేంద్ర ప్రభుత్వం మహిళలకు ప్రత్యేకంగా అందిస్తున్న పథకాలను, చట్టపరంగా వారికి సంక్రమింపజేస్తున్న రక్షణను వివరించారు.

కైకలూరులో గోదాము ప్రారంభం

కైకలూరు, మార్చి 6: రైతులకు అందుబాటులో ఉండేలా మార్కెట్ యార్డ్‌లలో నూతన గోదాములు వినియోగానికి తీసుకువస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో 2 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసుకునే గోదామును ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎంపీపీలు అడవి కృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, సర్పంచ్ నవరత్నకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రామారావు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొల్లులో అదనపు తరగతి గదులు..

కలిదిండి: కోరుకొల్లు జడ్పీ హైస్కూల్ ఆవరణంలో రూ.1.14 కోట్లతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వర రావు, ఏఎంసీ ఛైర్మన్ సత్యనారాయణ, సొసైటీ ఛైర్మన్ అంకెం నరస య్య, ఉప సర్పంచ్ చెన్నంశెట్టి నాగరాజు, వలవల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి

నూజివీడు టౌన్, మార్చి 6: ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులంతా ఈకేవైసీ పూర్తి చేసుకునేలా చూడాలని నూజివీడు ఎంపీడీవో కిరణ్‌కుమార్ అన్నారు. నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వివిధ ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హౌసింగ్ రిజిస్ట్రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, సంక్షేమ పథకాలు, పేమెంట్‌లకు సంబంధించి ప్రతి లబ్ధిదారు నుంచి ఈకేవైసీ పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు.

9 మంది గైర్హాజరు

ముదినేపల్లి, మార్చి 6 : ఇంటర్ ద్వితీయ సంవత్సరం గ్రూప్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 184 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 9 మంది గైర్హాజరైనట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఏలూరు జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ బృందం సభ్యులు, ముదినేపల్లి తహసీల్దార్ ఎస్.లక్ష్మీ నరస కుమారి పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

డ్రైన్లలో సిల్ట్ తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నూజివీడు టౌన్, మార్చి 6: నూజివీడు పట్టణంలో డ్రైన్‌లలో పేరుకుపోయిన సిల్ట్, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు ప్రక్రియను మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది బుధవారం చేపట్టారు. మురుగు పారేదెలా శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. నూజివీడు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది సిల్ట్ తొలగింపు ప్రక్రియను చేపట్టారు. బాహునగర్ సీఎస్ఐ చర్చివద్ద డ్రైన్‌లో సిల్ట్‌ను ఎక్స్‌కవేటర్‌తోనూ మిగిలిన ప్రాంతాల్లో సిబ్బందితోనూ నిర్వహిస్తున్నట్లు నాగరాజు తెలిపారు.

డయేరియా కలకలంతో పారిశుధ్య చర్యలు



నూజివీడు టౌన్, మార్చి 6: నూజివీడులో డయేరియా కలకలం నేపథ్యంలో పారిశుధ్య మెరుగుదల పనులను మున్సిపల్ అధికారులు చేపట్టారు. నూజివీడు పట్టణంలోని జంగాలపేట, చాకలిబజారు ప్రాంతాల్లో డయేరియా లక్షణాలు కనిపించటం, ఒకరు మృతి చెందటంతో పాటు మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు పారిశుధ్య మెరుగుదల, బ్లీచింగ్ చల్లే పనులను చేపట్టారు. ఇటు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోనూ, మంగళవారం రాత్రి, బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించి తగు వైద్యసేవలను అందించినట్లు నూజివీడు అర్బన్ పీహెచ్‌సీ వైద్య అధికారి కుర్రా నరేంద్రకృష్ణ తెలిపారు.

క్రైం కార్నర్

యువతిపై ఇంటర్ విద్యార్థుల అత్యాచారం

చాట్రాయి, మార్చి 6 : చాట్రాయిలో మానసిక దివ్యాంగురాలైన యువతి(21)పై ఇద్దరు ఇంటర్ విద్యార్థులు అత్యాచారం చేసినట్లు బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ కేసీహెచ్ స్వామి కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం తండ్రి తొమ్మిదేళ్ల క్రితం చనిపోగా, తల్లి నిత్యం కూలి పనులకు వెళుతుండటంతో బాధితురాలు ఒంటరిగా ఇంటి దగ్గర ఉంటున్నది. మంగళవారం తల్లి ఇంటికి వచ్చిన సమయంలో నిందితులు కుమార్తెపై అసభ్యంగా ప్రవర్తిస్తుండగా కేకలు వేయడంతో పారిపోయారని బాధితురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొంది. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మణికంఠ (ఫైల్)

చాట్రాయి, మార్చి 6: విజయవాడ- సత్తుపల్లి రహదారిలో సూరంపాలెం సబ్ స్టేషన్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం నరసాపురానికి చెందిన కంచర్ల మణికంఠ (29) మృతి చెందాడు. సత్తుపల్లి వైపు నుంచి బైక్‌పై వస్తున్న మణికంఠ సబ్ స్టేషన్ వద్ద మలుపులో బైక్ అదుపు తప్పటంతో కల్వర్టును ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతనిని విస్సన్నపేట అసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. తల్లిదండ్రులకు మణికంఠ ఒక్కడే కుమారుడు, హైదరాబాద్‌లో చిరుద్యోగం చేస్తూ, ఇటీవల నరసాపురంలో జరిగిన దేవాలయ ప్రతిష్ఠకు ఇంటికి వచ్చాడు. పెళ్లి సంబంధాలు చూస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఎస్సై కేసీహెచ్ స్వామి పరిశీలించారు.

విద్యుదాఘాతంతో ఆక్వా రైతు మృతి

కలిదిండి, మార్చి 6 : విద్యుదాఘాతంతో ఆక్వా రైతు మృతి చెందాడు. కొండూరు గ్రామానికి చెందిన కుందేటి నాగరాజు (38) బుధవారం తాడినాడ జడ్పీ హైస్కూల్ సమీపంలో ఉన్న తన రొయ్యల చెరువు వద్దకు వెళ్లి చెరువులో రొయ్యలను పరిశీలిస్తుండగా, చేతికి విద్యుత్ వైరు తగలటంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హుండీలో నగదు చోరీ

కలిదిండి, మార్చి 6 : కొండంగి వినాయకుడి ఆలయంలో మంగళవారం రాత్రి దుండగులు హుండీని పగులకొట్టి సొమ్ము దొంగిలించారు. ఆలయ నిర్వాహకులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హరహర మహాదేవ..

- శివరాత్రి పూజలకు ముస్తాబైన ఆలయాలు
- భక్తుల కోసం ఏర్పాట్లు

మహిమాన్వితుడు పెదగొన్నూరు మల్లేశ్వరుడు



ముదినేపల్లి, మార్చి 6 : పురాతన ఆలయాల్లో ఒకటైన ముదినేపల్లి మండలం పెదగొన్నూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 7 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సుమారు 300 సంవత్సరాల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించారు. స్థల పురాణం ప్రకారం పురాతన కాలంలో ఈ ఆలయం ఉన్న ప్రదేశంలో భూమి నుంచి బయల్పడిన శివలింగాన్ని అప్పట్లో చిన్న ఆలయం నిర్మించి గ్రామస్థులు ప్రతిష్ఠించారు. ఆలయాన్ని లంక లింగయ్య నిర్వహించేవారు. అనంతరం ఆలయం నిర్వహణ, దూప దీప నైవేద్యాలకు మీర్జాపురం జమీందారు 23 ఎకరాల వ్యవసాయ భూములను కేటాయించారు. తర్వాత మరో ఏడు ఎకరాల భూములు దాతలు సమకూర్చారు. అప్పట్లో ఆలయ ఆవరణంలో నాటిన జమ్మి, రావి చెట్లు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. సుమారు 100 సంవత్సరాల క్రితం ఆలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 1991లో ఈ ఆలయాన్ని ప్రభుత్వ నిధులు, దాతల విరాళాలతో పునర్నిర్మించారు. నవగ్రహాల ఆలయాన్ని కూడా దాతలు నిర్మించారు. మహా మహిమాన్వితుడిగా పెదగొన్నూరు మల్లేశ్వరుడు ప్రసిద్ధి చెందారు. ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇవో ఎస్.కె.కిషోర్ తెలిపారు. ఈ నెల 8వ తేదీ రాత్రి స్వామివారి కళ్యాణం జరుగుతుందని, కల్యాణం తిలకించటం భక్తులు ఎంతో అదృష్టంగా భావిస్తారని అర్చకుడు లంక వెంకటేశ్వర బాబు తెలిపారు.

చాట్రాయిలో ఉమారామలింగేశ్వరుడి తిరునాళ్లు



చాట్రాయి, మార్చి 6: పురాతన పుణ్యక్షేత్రమైన చాట్రాయి శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరిగే తిరునాళ్ళకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద చెరువులో సమృద్ధిగా నీరు ఉన్నందున భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని అంచనా వేస్తున్నారు. ఆలయ కమిటీచే భక్తులకు తాగునీరు, మజ్జిగ, పులిహోర ప్రసాదం పంపిణీతో పాటు 8న భారీ అన్నసమారాధన జరపనున్నది. ఆలయ చరిత్రపై పూజారి కొలకలూరి సుధాకర శర్మ మాట్లాడుతూ 13వ శతాబ్దంలో కాకతీయ రెడ్డిరాజుల పాలనలో చాట్రాయి పాలనా కేంద్రంగా ఉండేదని, ఇక్కడ పెద్దకోటలో శివాలయం ఉండేదన్నారు. శత్రురాజుల దండయాత్రలు కారణంగా కోటశిథిలమై కాలగర్భంలో కలిసిపోయిందన్నారు. సుమారు 200 ఏళ్ళ క్రితం ఓ రైతు కోట శిథిలాలను తొలగించి భూమిని సేద్యం చేస్తుండగా పెద్ద శివలింగం బయటపడిందని, అప్పటి వాస్తుపండితుల సలహాపై ఆ శివలింగాన్ని ఊరికి ఈశాన్యంలో పెద్ద చెరువు గట్టుపై ప్రతిష్ఠించి పూజలు చేయటం ప్రారంభించారని, నాటి నుంచి ఇది పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిందని అన్నారు. ఆలయానికి కొద్ది దూరంలో కన్యకల బావి ఉన్నదని, ఈ బావిలో రాత్రి సమయాల్లో దేవతాస్త్రీలు స్నానాలు చేస్తారని భక్తుల నమ్మకమని, ఈ బావి నీటితో 40 రోజులు స్నానమాచరించి శివునికి పూజలు చేస్తే కుజదోషం ఉన్న కన్యలకు త్వరగా వివాహాలు జరగటమేకాక ఎంతటి మొండి రోగాలైనా నయం అవుతాయని వివరించారు.



ఆగిరిపల్లిలో పార్థసారథికి సమస్యల ఏకరువు పెడుతున్న ప్రజలు



వింజరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

పార్థసారథికి సమస్యల ఏకరువు

ఆగిరిపల్లి, మార్చి 6: ఆగిరిపల్లి గన్నవరం రోడ్డులోని 4వ వార్డు వాసులను బుధవారం సాయంత్రం నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలుసు పార్థసారథి కలిశారు. వీధిదీపాలు వెలగటం లేదని, డ్రైనేజీ, చెత్తకుండీల సమస్యపై ప్రజలు మొరపెట్టుకున్నారు. పంచాయతీ ఈవోకు, సర్పంచ్‌కు ఎన్నిసార్లు చెప్పినా సమస్య తీరటం లేదని, డ్రైనేజి నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు విజృంభిస్తున్నాయని, వారానికి ఒకసారి కూడా చెత్తకుండీలు శుభ్రం చేయటం లేదని, సీసీ రోడ్లు వేయించాలని కోరగా పార్థసారథి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

బీసీల అభివృద్ధిని నీరుగార్చిన వైసీపీ..

నూజివీడు: వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు ఒరిగింది శూన్యమని, నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 76 వేల కోట్లు బీసీ సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేస్తానన్న జగన్‌రెడ్డి సదరు సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించి బీసీల అభివృద్ధిని ప్రశ్నార్థకం చేశారన్నారు. వివిధ విద్యా పథకాలను నిబంధనల పేరుతో నీరుగార్చిన జగన్‌రెడ్డి సామాజికంగా, రాజకీయంగా వారిని ఎదగనివ్వకుండా 34 శాతం రిజర్వేషన్‌లను 24 శాతానికి కుదించారన్నారు. రూ.5 వేల కోట్లతో గత ప్రభుత్వం మంజూరు చేసిన ఆదరణ పథకం పరికరాలను గోడౌన్‌లకే పరిమితం చేసి వైసీపీ ప్రభుత్వం తుప్పుపట్టేలా చేసిందని బీసీలకు జరిగిన అన్యాయాన్ని రాబోయే తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం తీరుస్తుందన్నారు. బీసీ డిక్లరేషన్ ద్వారా బలహీనవర్గాల అభ్యున్నతికి జనసేన, టీడీపీ ప్రభుత్వం ఏ విధంగా చర్యలు చేపట్టబోతోందో? జయహో బీసీలో చంద్రబాబు పేర్కొన్నారని అందుకు బీసీల తరఫున కృతజ్ఞత తెలుపుతున్నామన్నారు. ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేసే కొత్త సంప్రదాయానికి వైసీపీ తెరతీసిన విషయం స్థానిక శాసనసభ్యుడు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గుర్తుంచుకుని మాట్లాడాలని పార్థసారథి అన్నారు.

వింజరంలో జనంలోకి జనసేన

కైకలూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ కోరారు. బుధవారం కైకలూరు మండలం వింజరంలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయం సాధిస్తే కైకలూరు నియోజకవర్గానికి చేపట్టబోయే అభివృద్ధి పనులు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. జనసేన నాయకులు పుప్పాల సూర్యప్రకాశరావు, నల్లగోపుల చలపతి, పట్నాల వినోద్‌కుమార్, కే సాయినవీన్, గుడివాడ సత్యనారాయణ, తోట సుందర్, ఆకుల వెంకటరమేష్ తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయిలో మహిళలకు సన్మానం



నూజివీడులో మహిళా అధికారులను సత్కరిస్తున్న దృశ్యం

మహిళలతోనే దేశాభివృద్ధి

చాట్రాయి, మార్చి 6: అవకాశాలను అందిపుచ్చుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తహసీల్దార్ మహ్మద్ మసూద్ అలీ, ఎంపీడీవో మంగాకుమారి, ఎంఈవో బ్రహ్మచారి కోరారు. చాట్రాయి వెలుగు కార్యాలయంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో అధికారులు మాట్లాడుతూ స్త్రీలు ప్రభుత్వం, బ్యాంకుల సహకారంతో చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే పది మందికి ఉపాధి కలగటంతో పాటు, ఆర్థికాభివృద్ధి సాధిస్తారని, తద్వారా దేశాభివృద్ధి, పేదరిక నిర్మూలన జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు, మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. పలువురు మహిళా అధికారులను, సిబ్బందిని సన్మానించారు. వెలుగు ఏపీఎం శేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో అసిస్టెంట్ సీడీపీవో నాగేశ్వరి, ఏపీఎం లక్ష్మీకుమారి, పీహెచ్ఎన్ ధనకుమారి, అంగన్వాడీ సూపర్‌వైజర్ గాయత్రి, మండల మహిళా సమాఖ్య కార్యదర్శి సరోజిని, డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: మహిళలు అనేక రంగాల్లో ముందడుగు వేస్తున్నారని నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్వాక్రా మహిళలకు పలు క్రీడాపోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి బుధవారం నూజివీడు వెలుగు కార్యాలయంలో బహుమతులు అందించారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేసినప్పుడే కుటుంబ వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. నూజివీడు వెలుగు ఏపీఎం దయాల రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నూజివీడు ఎంపీడీవో కిరణ్‌కుమార్, సీడీపీవో నూరానీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.నవత, వీవోల అధ్యక్షులు, బుక్‌కీపర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా అధికారులను ఎంపీపీ సత్కరించారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండండి : ఐజీ

ఏలూరు క్రైం, మార్చి 6 : ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజి అశోక్‌కుమార్ అన్నారు. సైబర్ క్రైం నివారణ కోసం ప్రజలను అప్రమత్తం చేయడానికి తయారు చేసిన గోడపత్రికను ఏలూరు రేంజ్ కార్యాలంయలో ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సైబర్ నేరగాళ్ళకు వరంగా మారిందన్నారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. లాటరీ, లోను వచ్చిందని కాల్ కాని, మేస్సేజ్ కాని వచ్చినట్లయితే వాటిని ఓపెన్ చేయవద్దన్నారు. ప్రజలు సైబర్ నేరాలకు గురైతే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలని, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులు, ఏలూరు సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ బిహెచ్ వెంకటేశ్వర్లు, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కాగితపు శ్రీనివాసరావు, సైబర్‌సెల్ ఎస్ఐ మధురాజు పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పార్థసారథి సిమెంట్ తూరల వితరణ



ముసునూరు, మార్చి 6: బీసీ కాలనీలో మురుగు నీరు, వర్షపునీరు నిల్వ ఉండకుండా సమస్య పరిష్కారానికి నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి సమకూర్చిన రూ. లక్ష విలువైన తొమ్మిది సిమెంట్ తూరలను టీడీపీ నాయకులు బుధవారం యాదవ సంఘం పెద్దలకు అందజేశారు. ఇటీవల లోపుడి బీసీ కాలనీ వాసులు ఎమ్మెల్యే పార్థసారథిని కలిసి సమస్యను వివరించారు. బీసీ కాలనీలో వర్షపునీరు, మురుగునీరు వెళ్ళేందుకు ఉన్న కల్వర్ట్ పూర్తిగా ధ్వంసమైందని, దీంతో నీరు నిలిచిపోవడంతో కొన్ని ఇళ్ళు ముంపునకు గురవుతున్నాయని, సిమెంట్ తూరలు అవసరమని కోరగా స్పందించిన పార్థసారథి తూరలు ఇచ్చారని టీడీపీ నాయకులు తెలిపారు. కల్వర్ట్ తొలగించి ఈ తూరలు వేస్తే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని బీసీ కాలనీ వాసులు పేర్కొన్నారు. అడిగి వెంటనే తమ సమస్య పరిష్కారానికి సహకరించిన పార్థసారథికి తాము అండగా ఉంటామని యాదవ సంఘం పెద్దలు తెలిపారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు వేంపాటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ పంజుగల వెంకయ్య, పేరం గంగరాజు, చలమాల వెంకటేశ్వరరావు, నక్క చెన్నారావు, పొనగంటి గోపీచంద్, గద్దె రఘుబాబు, సురేంద్ర, మండలపు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఫలితాలు సాధించాలి : డీఈవో



దొడ్డిపట్ల హైస్కూల్లో విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈఓ

కైకలూరు, మార్చి 6: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు బోధించాలని డీఈవో ఎస్. అబ్రహం అన్నారు. బుధవారం కైకలూరు మండలం గోపవరం, సీతనపల్లి గ్రామాల్లోని ఎంపీ యూపీ స్కూళ్ళు, దొడ్డిపట్ల జడ్పీ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులను పాఠ్యాంశాలపై ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రతీ పాఠశాలలోనూ నూరుశాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలయ్యేలా చూడాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు కె విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ప్రభుత్వ హైస్కూళ్లలో 9వ తరగతి విద్యార్థులకు డిజిటల్ విద్యపై పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం తెలిపారు. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు జడ్పీ హైస్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించి 9వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ, వాటి వినియోగంపై శిక్షణ తదితర అంశాలను పరిశీలించారు. హైస్కూల్‌లో ఏపీ ఫైబర్ నెట్ ద్వారా ప్రతి తరగతి గదికి ఇంటర్ నెట్ సౌకర్యం ఏర్పాటును పరిశీలించారు.

కలిదిండి: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో అన్నారు. బుధవారం కలిదిండి, కోరుకొల్లు, ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూళ్లను సందర్శించి మాట్లాడుతూ మార్చి 18 నుంచి ప్రారంభమయ్యే పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జడ్పీ హైస్కూళ్లలో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉంటోందని, బడి మానేసిన పిల్లలను తిరిగి చేర్పించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. కోరుకొల్లు జడ్పీ హైస్కూల్‌లో ఐఎఫ్‌పి ప్యానెల్‌ను ఉపయోగించుకోకపోవటంపై ఉపాధ్యాయులను మందలించారు.

బీసీ డిక్లరేషన్‌పై ప్రశంసల జల్లు

మంగళగిరిలో నిర్వహించిన జయహో బీసీ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై ఆ వర్గాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. వైసీపీ తమకు నమ్మక ద్రోహం చేసినా టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు



ముదినేపల్లి: తెలుగుదేశం - జనసేన ఉమ్మడి బీసీ డిక్లరేషన్ చాలా బాగుంది. వెనుకబడిన వర్గాల పేద యువతకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ఆదరణ, స్వయం ఉపాధి పథకాలను అమలు చేస్తామనటం, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ వర్తింపు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో మేలు. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకొస్తామనటం హర్షణీయం. మంచి బీసీ డిక్లరేషన్ ప్రకటించిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు.

-పత్తి శివశంకర్, అల్లూరు

బీసీల జీవితాల్లో కొత్త వెలుగులు



చాట్రాయి: బీసీ డిక్లరేషన్ అమలైతే వెనుకబడిన కులాల జీవితాల్లో కొత్త వెలుగులు రావటం ఖాయం. 50 ఏళ్ళకే రూ. 4 వేలు పెన్షన్, ప్రత్యేక రక్షణ చట్టం, సబ్‌ప్లాన్‌కు లక్షన్నర కేటాయింపు, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు, ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాల పునరుద్ధరణ తదితర అంశాలు అమలు చేస్తే విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలు ముందడుగు వేసి సమాజంలో గౌరవంగా తలెత్తుకొని బ్రతకవచ్చు

- కంపసాటి చెన్నారావు, బీసీ కులస్తుడు, చాట్రాయి

50 ఏళ్లకే పింఛన్ ఒక వరం



కలిదిండి: బీసీ డిక్లరేషన్‌తో రాష్ట్రంలోని బీసీలకు సముచిత స్థానం లభిస్తుంది. టీడీపీ స్థాపించినప్పటి నుంచి బీసీలకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. భవిష్యత్‌లో రాజకీయ, సామాజిక, ఆర్థికంగా ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ప్రకటించటం ఒక వరంగా భావిస్తున్నా.

-అంద్రాజు శ్రీనివాస్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మట్టగుంట

బీసీల పక్షపాతి టీడీపీ



ముసునూరు: బీసీ డిక్లరేషన్‌తో టీడీపీ బీసీలకు పెద్దపీట వేసింది. ఈ డిక్లరేషన్‌ను గతంలో ఏ రాజకీయ పార్టీ ప్రకటించలేదు. 50 ఏళ్ళకు పెన్షన్, బీసీ సాబ్‌ప్లాన్‌తో ఉపాధి కల్పన, ముఖ్యంగా బీసీలకు రక్షణ చట్టం వల్ల బీసీలకు మేలు చేకూరుతుంది. బీసీల పాక్షపాతిగా టీడీపీ నిరూపించుకుంది.

- మానురాజు సురేష్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి

పీజీ సెంటర్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నవీన



నూజివీడు, మార్చి 6: డాక్టర్ ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పీజీ స్టడీస్ (నూజివీడు) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నవీన లావణ్య లత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్‌బాబు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణా వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ బయోసైన్సెస్ అండ్ బయోటెక్నాలజీ విభాగంలో సహ ఆచార్యులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న లావణ్యలతను నూజివీడు పీజీ సెంటర్ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. ఆమెను రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబు, ఫైనాన్స్ ఆఫీసర్ రతన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

లోక్ అదాలత్ వాయిదా

నూజివీడు టౌన్, మార్చి 6: జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసినట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎ. నాగశైలజ ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల లోక్ అదాలత్ కార్యక్రమాన్ని 16వ తేదీ వాయిదా వేయటం జరిగిందని, పరిష్కరించదగ్గ కేసులను కక్షిదారులు లోక్ అదాలత్‌కు హాజరై పరిష్కరించుకోవాలని ఆమె తెలిపారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులకు శిక్షణ : ఆర్డీవో

నూజివీడు, మార్చి 6: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధి విధానాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నూజివీడు ఆర్డీవో వై.భవానీ శంకరి తెలిపారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల ద్వారా ఓటింగ్ ప్రక్రియపై శిక్షణ ఉంటుందని ఆమె తెలిపారు.

నేడు కామినేని ఆత్మీయ సమావేశాలు

మండవల్లి, మార్చి 6: మాజీమంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ గురువారం మండవల్లి మండలంలో జరిగే ఆత్మీయ సమావేశాల్లో పాల్గొననున్నారు. సాయంత్రం 4 గంటలకు మండలంలోని అప్పాపురం, 5 గంటలకు అల్లినగరం, 6 గంటలకు కానుకొల్లు గ్రామాల్లో జరిగే ఆత్మీయ సమావేశాల్లో పాల్గొంటారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కామినేని స్వగ్రామమైన వరహాపట్నంలో ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు ఆయన వ్యక్తిగత సహాయకులు తెలిపారు.

1.86 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల : ఏడీ

నూజివీడు టౌన్, మార్చి 6: మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు 1.86 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు నూజివీడు వ్యవసాయ శాఖ ఏ.డి విద్యాసాగర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో నూజివీడు నియోజకవర్గ పరిధిలో దాదాపు 3295 మంది రైతులు 1213 హెక్టార్లలో పంటను నష్టపోయారని ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కోటి 86 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేసిందన్నారు. ఆగిరిపల్లి మండల పరిధిలో 386 మంది రైతులు 121.97 హెక్టార్లలో పంటలు నష్టపోగా 17 లక్షలు, చాట్రాయి మండలంలో 673 మంది రైతులు 308 హెక్టార్లలో పంటను నష్టపోగా రూ. 51 లక్షలు, ముసునూరు మండలంలో 1270 మంది రైతులు 445 హెక్టార్లలో పంటను నష్టపోగా రూ.66 లక్షలు, నూజివీడు మండలంలో 966 మంది రైతులు 338 ఎకరాల్లో పంటను నష్టపోగా రూ. 51 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీగా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

కాట్రేనిపాడులో సురక్ష శిబిరం



ముసునూరు, మార్చి 6: మండలంలోని కాట్రేనిపాడులో మంగళవారం జరిగిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 522 మందికి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని నూజివీడు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జాస్తి జగన్‌మోహన్‌రావు, జిల్లా సురక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకృష్ణ తనిఖీ చేశారు. వైద్యులు డాక్టర్ షకీనా ఇవాంజలి, డాక్టర్ మేఘన, డాక్టర్ ప్రవీణ్‌లు 522 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, 41 మందికి కళ్ళజోళ్ళు అవసరమని నిర్ధారించారు. సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు, ఎంపీటీసీ సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, ఎంపీడీవో పద్మావతిదేవి, ఎంపీహెచ్‌వో అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా : ముద్దరబోయిన

ముసునూరు, మార్చి 6: ఇండిపెండెంట్‌గా పోటీచేస్తున్నానని, నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం గోగులంపాడులో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వందలాది మందితో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అందని సొమ్ము.. డ్వాక్రా మహిళల్లో నిరాశ

ఆగిరిపల్లి, మార్చి 6: ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు అండగా నిలుస్తానని, వారి గ్రూపుల బ్యాంక్ ఖాతాలకు సొమ్ము జమ చేస్తానని జనవరిలో బటన్ నొక్కి జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు నీటిమీద రాతలయ్యాయి. మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకుందామని ఎదురుచూసే మహిళలు తమ ఖాతాల్లో జగనన్న వేసే సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు ఒక్క ఆగిరిపల్లి మండలంలోనే 1250 డ్వాక్రా సంఘాలు ఉంటే వాటిలో 500 సంఘాలకు ఇంకా సొమ్ము జమకాక ఉసూరుమంటున్నారు.